PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక :134 | విజయవాడ, సోమవారం 16 డిసెంబర్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 16 December 2024 | Rs

బౌలర్లు బేజారు

రోజంతా చెమటోడ్చినా ఏడు వికెట్లే

ట్రావిశ్ హెడ్, స్మిత్ శతక జోరు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 405/7

భారత్, ఆసీస్ మూడో టెస్టు రెండో రోజు

6

జాకీర్ హుస్సేన్ ఇక లేరు



న్యూఢిల్లీ : ప్రఖ్యాత తబలా విద్వాంసుడు జాకీర్ హుస్సేన్ (73) ఆదివారం తుది శ్వాస విడిచారు. అమెరికాలో నివాసం ఉంటున్న జాకీర్ హుస్సేన్ గత 15 రోజుల నుంచి శాన్ ఫ్రాన్సిస్కోలోని ఆసుపత్రిలో ఐసియులో చికిత్స పొందుతున్నారు. హృదయ సంబంధిత సమస్యలు, రక్తపోటు బాధపడుతూ ఆదివారం మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రముఖ తబాలా విద్వాంసులు ఉస్తాద్ అల్లా రఖ ఖాన్ పెద్ద కుమారుడే జాకీర్ హుస్సేన్. 1951 మార్చి 9న ముంబయిలో జన్మించారు. ఏడేళ్ల వయస్సు నుంచే తబాలాలో ప్రావీణ్యం సంపాదించారు. 12 ఏళ్ల వయస్సులోనే తొలి కచేరీ ఇచ్చారు. 1988లో పద్మశ్రీ, 2002లో పద్మ భూషణ్, 2023లో పద్మ విభూషణ్ అందుకున్నారు. 1990లో సంగీత్ నాటక అకాడమీ అవార్డు గెలుచుకున్నారు.

అమరజీవి స్ఫూర్తితో సుపరిపాలన

పొట్టి శ్రీరాములు పేరుతో తెలుగు విశ్వవిద్యాలయం

సిఎం చంద్రబాబు నాయుడు



తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరజీవి పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఐ అండ్‌పిఆర్ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా "ఆత్మార్పణం" పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ సుస్థిర ప్రభుత్వంతోనే నిరంతర సంక్షేమం, అభివృద్ధి సాధ్యమౌతుందని చెప్పారు. తెలుగు ప్రజలు గర్వంగా చెప్పుకునే వ్యక్తి పొట్టి శ్రీరాములు అని అన్నారు. చాలా కొద్ది మందే జాతికోసం ఆలోచిస్తారని, ఇదే కోవలో తెలుగుజాతి కోసం ఆలోచించి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రాన్ని సాధించిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అని చెప్పారు. సంకల్పసిద్ధి కోసం త్యాగం చేసిన ఏకైక నాయకుడని ఆయన నివాళులర్పించారు. త్వరలోనే రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు పేరుతో తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామన్నారు. అమరజీవి పుట్టిన ఊరితో పాటు అమరావతిలో స్మారకాన్ని అభివృద్ధి చేస్తామని సిఎం ప్రకటించారు. పొట్టి శ్రీరాములు 125వ జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఇటువంటి ఎందరో మహనీయుల స్ఫూర్తితోనే 'స్వర్ణాంధ్ర విజన్ -2047' తీసుకొచ్చామని చెప్పారు. డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆంధ్ర జాతికి నాయకుడన్నారు. రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆత్మార్పణ గావించిన అమరజీవి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పి.నారాయణ, కింజరాపు అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారధి, విజయవాడ ఎంపి కేశినేని చిన్ని, ప్రభుత్వ విప్ బోండా ఉమా మహేశ్వరరావు, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకటరావు, శ్రీరాం రాజగోపాల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సభ అనంతరం పొట్టి శ్రీరాములు కుటుంబ సభ్యులను శాలువాలు, మెమొంటోలతో సన్మానించారు.

అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి పిలుపు

2

బిజెపి రాయలసీమ ద్రోహి

- ఫిబ్రవరి నుంచి 'ఉక్కు'పై ఉద్యమం
- టిడిపి, జనసేన వైఖరిని స్పష్టం చేయాలి : రాంభూపాల్

3

దొడ్డిదారిన 'నల్లచట్టాలు' !

- గుట్టుచప్పుడుగా వ్యవసాయ మార్కెటింగ్ పాలసీ
- రద్దు చేసిన చట్టాల్లోని అంశాలతోనే ముసాయిదా
- రైతు సంఘాల ఆందోళన

5

అంగన్‌వాడీలపై మోయలేని పని భారం !

- 'గౌరవ' వేతనం పేరుతో శ్రమ దోపిడీ
- ఇచ్చేది గోరంత... చాకిరీ కొండంత

5

వ్యవసాయ కమతాలపై కేంద్రం సర్వే

- పైలట్ ప్రాజెక్టుగా రాష్ట్రం ఎంపిక
- రైతుల వ్యక్తిగత సమాచారం, మార్కెటింగ్ అంశాలపైనా దృష్టి

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

వ్యవసాయ కమతాలపై కేంద్ర ప్రభుత్వం సర్వే ప్రారంభించింది. ఈ సర్వేలో రాష్ట్రాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. దేశంలో వ్యవసాయ కమతాల తీరు, సామర్థ్యం, సేద్యంలో ఎవరు నేరుగా లబ్ధిపొందుతున్నారనే విషయాలను సేకరిస్తున్నారు. కుటుంబాన్ని, సర్వే నెంబరును యూనిట్‌గా తీసుకుని సర్వే చేస్తున్నారు. సాగు చేసే వ్యక్తి, ఆయనకు వ్యవసాయం ద్వారానే ఆదాయం వస్తుందా? ఇతర వ్యాపార, ఉద్యోగ కార్యకలాపాలు ఉన్నాయా? మహిళలా? పురుషులా? పూర్తి స్థాయిలో సేద్యంపై ఆధారపడి ఉన్నారా? పార్టుటైంగా సమయం కేటాయిస్తున్నారా? కుటుంబంలో18 ఏళ్లు నిండిన వారు ఎంతమంది ఉన్నారు? భూ యజమానికి ఉన్న ప్రధాన ఆదాయం వనరు ఏమిటి? స్వయం ఉపాధి, ఉద్యోగం, లేక స్థిరమైన ఆదాయం, కార్మికుడిగా పనిచేస్తున్నారా? ఇతర మార్గాల్లో ఆదాయం వస్తోందా? అనే వివరాలు సేకరిస్తున్నారు. వ్యవసాయం, పశుపోషణ, వ్యవసాయేతర రంగాల్లో ప్రవేశం, ఆదాయం, రిటైర్డు ఉద్యోగిగా పింఛను పొందుతున్నారా? ఏ రంగంలో స్థిరపడ్డారో వివరాలు తీసుకోవాలని ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. పండించిన వ్యవసాయ ఉత్పత్తులను వ్యక్తిగతంగా వినియోగించుకుంటున్నారా? అమ్ముకుంటున్నారా? కొంత అమ్ముకుని, కొంత సొంతానికి వినియోగించుకుంటున్నారా అనే అంశంపై వివరాలు సేకరించాలని నిర్ణయించారు. వ్యవసాయ ఉత్పత్తుల విక్రయానికి ఉన్న అవకాశాలు, ప్రైవేటు వ్యాపారులు, ప్రభుత్వ సంస్థలు, మార్కెట్ యార్డులు, ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు, ఉత్పత్తిదారుల అసోసియేషన్ల పాత్ర తదితర వివరాలు కూడా తీసుకుంటున్నారు. కాంట్రాక్టు వ్యవసాయానికి పెట్టుబడిదారులు, కంపెనీల వివరాలు, ఇతర వివరాలు సేకరిస్తున్నారు. భూమి సాంద్రత, సామర్థ్యం, ఏయే పంటలు పండడానికి అవకాశాలు ఉన్నాయి? నీటి వనరుల వివరాలు కూడా తీసుకుంటున్నారు. రైతుల విద్యార్హతలు, సేద్యానికి లభిస్తున్న ప్రభుత్వం తోడ్పాటు, విత్తన సరఫరా నుంచి విక్రయం వరకు ఎదురవుతున్న అంశాలపై కూడా సమాచారం తెలుసుకుంటున్నారు. సేద్యంలో మెళకువలపై అందుతున్న శిక్షణ, ప్రభుత్వ ఏజెన్సీల ప్రోత్సాహాన్ని కూడా సర్వేలో పొందుపరుస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, పెట్టుబడి సాయం, బీమా, పంట రుణాలు, కనీస మద్దతు ధర, స్వయం సహయక సంఘాల నుంచి రైతులకు అందుతున్న సహకారం, సాంకేతిక పరిజ్ఞానం వివరాలు తీసుకుంటున్నారు. ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపుతున్నారా? సహకార సంఘాలు, బ్యాంకుల నుంచి అందుతున్న తోడ్పాటు, ఎరువులు, పురుగు మందుల వినియోగం, ఇంటిగ్రేటెడ్ పెస్టు మేనేజ్‌మెంట్, భూసారం, వాతావరణ పరిస్థితులు, సేద్యంలో ఇబ్బందులు, యాంత్రీకరణ, ప్రభుత్వ సహకారం, నీటి వసతికి వినియోగిస్తున్న పరికరాలు, పంపుసెట్లకు వినియోగిస్తున్న విద్యుత్ సరఫరాకు ఉన్న అవకాశాలు, నీటి వసతి ఉన్న భూములు, వర్షాధారంపై ఆధారపడిన భూములు తదితర వివరాలు సేకరించి గ్రామాల వారీగా వివరాలు పంపాలని కేంద్రం కోరింది. ఇప్పటికే భూ కమతాలపై రెండుసార్లు సర్వే జరిగిందని, మూడో విడత మరింత లోతుగా సమాచారం తీసుకుని విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి డేటాను సేకరిస్తున్నారని అధికారులు తెలిపారు. ఈ సర్వేను ఈ నెల 31వ తేదీలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం అన్ని జిల్లాల అధికారులనూ ఆదేశించింది. రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ సర్వేలో రెవెన్యూ శాఖతోపాటు వ్యవసాయ అనుబంధ శాఖలు కూడా భాగస్వామ్యం అవుతున్నాయి.



అక్షయ కుమార్ దత్ వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న బివి రాఘవులు

భారతీయులను కలిపి ఉంచేది రాజ్యాంగమే

- దాన్ని రక్షించుకోవటం తక్షణ కర్తవ్యం
- యుటిఎఫ్ నేత దత్ వర్ధంతి సభలో బివి రాఘవులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాజ్యాంగాన్ని రక్షించుకోవటమే తక్షణ కర్తవ్యమని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటీఎఫ్) సీనియర్ నాయకుడు ఎం అక్షయ కుమార్ దత్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రాఘవులు స్మారకోపన్యాసం చేశారు. రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మతాధారిత రాజ్యాంగం తప్పని చెప్పారు. దాంతో దేశ ఐక్యతకు విఘాతమేర్పడుతుందని వివరించారు. భారతీయులందరిని ఒక్కటిగా ఉంచగలిగేది రాజ్యాంగమేనన్నారు. అక్షయకుమార్ దత్ విశ్వమానవుడని కొనియాడారు. లౌకికవాది, మానవతావాది, సమతావాది. కులం, మతం, ప్రాంతం, రంగులకు అతీతంగా సమానత్వం మిగతా 5లో

ఇంటి నిర్మాణంలో ఘర్షణ

- ముగ్గురు మృతి
- ఏడుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- సామర్లకోట

ఇంటి నిర్మాణంలో చోటుచేసుకున్న వివాదంలో ఒక గ్రూపునకు చెందిన ముగ్గురు మృతి చెందారు. మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఇంటి స్లాబ్ నిర్మాణం పనుల్లో నిమగ్నమై ఉన్న ఒకే కుటుంబానికి చెందిన ఎనిమిది మందిపై మరో గ్రూపునకు చెందిన వారు కత్తులు, కర్రలతో విచక్షణారాహితంగా దాడి చేశారు. దీంతో, కారదాల ప్రకాశరావు (45) అక్కడిక్కడే మృతి చెందారు. మరో తొమ్మిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో కారదాల చంద్రరావు (60) సామర్లకోట ప్రభుత్వాస్పత్రిలోనూ, కారదాల ఏసుబాబు (45) కాకినాడ ప్రభుత్వాస్పత్రిలోనూ చికిత్స పొందుతూ మృతి చెందారు. మిగిలిన ఏడుగురూ కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో కారదాల పండు, కారదాల బాబీ పరిస్థితి విషమంగా ఉంది. సంఘటనా స్థలాన్ని డిఎస్‌పి శ్రీహరిరాజు, సిఐ కృష్ణభగవాన్ పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టుకోసం పోటీ!

పెరుగుతున్న లోకేష్ జోక్యం • బిజెపి నేతలతో పవన్ మంతనాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ప్రభుత్వంలో, కూటమిలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ జోక్యాన్ని తగ్గించేందుకు, ఆయన ప్రమేయాన్ని కట్టడి చేయించేందుకు ఉప ముఖ్యమంత్రి, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ కేంద్రంలోని బిజెపి పెద్దల శరణుజొచ్చినట్లు తెలుస్తోంది. పవన్ ఇటీవలి ఢిల్లీ పర్యటన అజెండాలో ఈ అంశమే ప్రధానంగా ఉందని కూటమి పార్టీల్లో చర్చ జరుగుతోంది. కేబినెట్ మంత్రిగా ఉన్న లోకేష్ తతిమ్మా మంత్రులు నిర్వహిస్తున్న శాఖల్లో వేలు పెడుతున్నారని, మంత్రుల కార్యాలయాల్లో సిబ్బందిని నియమించే విషయంలో కూడా తాను చెప్పిన వారినే వేసుకోవాలనే వరకు లోకేష్ జోక్యం వెళ్లిందని పవన్, కొందరు జనసేన ముఖ్య నేతలు అసంతృప్తిగా ఉన్నారు. పవన్ నిర్వహిస్తున్న పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణ శాఖలు మినహా తతిమ్మా అన్నింటిలోనూ లోకేష్ తన ముద్ర ఉండాలని ప్రయత్నిస్తున్నారని ఆంటున్నారు. లోకేష్ జోక్యం మితిమీరుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు అదుపు చేయడం లేదన్న భావన జనసేన చీఫ్‌లో ఉందని చెబుతున్నారు. దీంతో బిజెపి కేంద్ర పెద్దల సహాయాన్ని కోరినట్లు సమాచారం. కాగా పవన్ అప్పీల్‌పై కేంద్ర బిజెపి పెద్దలు ఆలకించినప్పటికీ ఆచితూచి అడుగేయాలని యోచిస్తున్నట్లు తెలిసింది.

ఆది నుంచీ!

ఎన్నికల్లో కూటమి అసాధారణ విజయం అనంతరం కేబినెట్ కూర్పు సమయంలోనే పవన్‌కు కేటాయించాల్సిన శాఖ, ఇవ్వాల్సిన హోదాపై టిడిపిలో చర్చ జరిగిందని చెబుతారు. కేబినెట్‌లో లోకేష్‌కు, పవన్‌కు ఒకే హోదా ఇవ్వాలని టిడిపి నేతల్లో చాలామంది కోరుకున్నారని సమాచారం. అప్పటి పరిస్థితులు, బిజెపి సూచనల మేరకు పవన్‌కు డిప్యూటి సిఎం హోదా ఇచ్చారు. లోకేష్‌ను కేబినెట్ మంత్రిని చేశారు. కాగా, లోకేష్ నేరుగా ప్రజల నుంచి టిడిపి కార్యాలయంలో వినతులు స్వీకరించడం మొదలు పెట్టాక పోటీగా పవన్ కూడా జనసేన కార్యాలయంలో ప్రజల నుంచి వినతిపత్రాల స్వీకరణ ప్రారంభించారు. అనంతరం ఇతర మంత్రులూ ఈ పని చేస్తున్నారు. మంత్రుల కార్యాలయాల్లో కాకుండా పార్టీ కార్యాలయాల్లో ప్రజా దర్బారులు నిర్వహించడంపై విమర్శలొచ్చాయి. ఇదిలా ఉండగా అన్ని శాఖల్లోనూ లోకేష్ నేరుగా జోక్యం చేసుకోవడంపై పవన్ పలు సందర్భాల్లో సన్నిహితుల వద్ద అసహనం వ్యక్తం చేశారని సమాచారం.

'రాజ్యసభ'తో మరింతగా...

రాజ్యసభ సభ్యుల ఎంపికలో పవన్ సోదరుడు నాగబాబుకు నో చెప్పి లోకేష్ తన ప్రధాన అనుచరుడు సతీష్‌కు ఇప్పించుకోవడంతో వ్యవహారం ముదిరింది. నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకుంటున్నట్లు టిడిపి చేసిన ప్రకటన వెనుక పవన్ పట్టుదల, బిజెపి డైరెక్షన్ ఉందని చెబుతున్నారు. లోకేష్ నిర్వహిస్తున్న విద్యాశాఖ సలహాదారుగా ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు నియామకం వెనుక బిజెపి, పవన్ పాత్ర ఉందని సమాచారం. చంద్రబాబే పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటారని ఇటీవల అసెంబ్లీలో, తనకు బాబు ప్రాధాన్యత ఇస్తున్నారంటూ విజన్ - 2047 డాక్యుమెంట్ విడుదల సందర్భంగా పవన్ వ్యాఖ్యలు పరోక్షంగా లోకేష్ పట్ల తన అసంతృప్తిని వ్యక్తం చేయడానికేనని కూటమి పార్టీల్లోని సీనియర్లు విశ్లేషిస్తున్నారు.

'ఉపాధి'కి దూరంగా గిరిజనులు

- సగం మందికే వందరోజుల పని
- పనులే దొరకని కుటుంబాలు అనేకం!



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి చట్టం అమలుకు నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఒక వైపు నిధుల్లో భారీ కోత పెడుతుండగా, మరోవైపు క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. రాష్ట్రంలో గిరిజనులకు ఈ చట్టం అమలవుతున్న తీరే దీనికి నిదర్శనం. గత ఏడాది వంద రోజుల పనులు పూర్తి చేసిన గిరిజన కుటుంబాల సంఖ్య 1,21,177 కుటుంబాలు ఉండగా, ఈ ఏడాది ఎనిమిదిన్నర నెలల్లో 66,656 మందికి మాత్రమే వందరోజుల పని దొరికింది. గిరిజనుల్లో మొత్తం జాబ్ కార్డులు కలిగిన కుటుంబాలు 2023-24లో 5,61,104 ఉండగా ఈ ఏడాది అదనంగా 8,290 కొత్త జాబ్ కార్డులు మంజూరు చేశారు. అయినప్పటికీ పూర్తిస్థాయిలో పని దొరకడం లేదు. మరోవైపు రాష్ట్రంలో మొత్తం జాబ్ కార్డులలో గిరిజనుల జాబ్ కార్డుల సంఖ్య 8.15 శాతంగానే ఉండటం గమనార్హం. నెల్లూరు జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ఇటీవల గిరిజనుల హౌస్ హోల్డ్ సర్వే నిర్వహించారు. జిల్లాలోని గిరిజనుల్లో 40 శాతం మందికి జాబ్ కార్డులు లేవని, 13 శాతం మందికి బ్యాంక్ ఖాతాలు లేవని, 25 శాతం మందికి ఓటరు కార్డులు లేవని ఈ సర్వేలో వెల్లడైంది. రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితి ఇదే విధంగా ఉంటుందని గిరిజన సంక్షేమ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఉపాధి పథకానికి ఆధార్ తప్పనిసరి కావడంతో ఆధార్ కార్డులు లేనివారికి ఈ పథకం ప్రయోజనాలు అందడం లేదు.

జిల్లాల వారీగా ఇలా...

అల్లూరి సీతారామరాజు జిల్లాలో 2,20,054 గిరిజన కుటుంబాలకు జాబ్ కార్డులు ఉండగా, వీరిలో 1,87,272 కుటుంబాలకు పని కల్పించారు. వీరిలో 37,947 కుటుంబాలకు మాత్రమే వందరోజుల పని లభించింది. పార్వతీపురం మన్యం జిల్లాలో 70,621 గిరిజన కుటుంబాలకు జాబ్ కార్డులు ఉండగా, 62,228 కుటుంబాలకు పని కల్పిస్తే వంద రోజులు పూర్తయినవి కుటుంబాలు 16,596 మాత్రమే. ఏలూరు జిల్లాలో 30,734 గిరిజన కుటుంబాలకుగానూ వంద రోజులు పనులు చేసిన కుటుంబాలు కేవలం 1,827 మాత్రమే. ఈ జిల్లాలో దాదాపుగా పదివేల కుటుంబాలకు ఇప్పటివరకు పనులే చూపలేదు. పల్నాడు జిల్లాలో 11,831 కుటుంబాలకు ఇప్పటివరకు పనులు చూపలేదు. ఈ జిల్లాల్లో వంద రోజులు పనులు చేసిన గిరిజన కుటుంబాలు కేవలం 258 మాత్రమే! నెల్లూరు జిల్లాలో 25,739 గిరిజన కుటుంబాలకు జాబ్ కార్డులు ఉండగా, 11,600 కుటుంబాలకే పనులు చూపించారు. వీటిలో కేవలం 119 కుటుంబాలకు మాత్రమే వంద రోజుల పనులు లభించాయి. తిరుపతి జిల్లాలో 23,941 గిరిజన కుటుంబాలకు జాబ్ కార్డులు ఉండగా, 13,855 కుటుంబాలకు పని కల్పించారు. వీరిలో వంద రోజుల పనిచేసిన కుటుంబాలు 1,500మాత్రమే!

డ్రగ్స్‌తో ఉన్న పాక్ డ్రోన్ స్వాధీనం



జమ్ము : జమ్ముకాశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకున్నాయని, అక్కడ ఉగ్రవాద కార్యక్రమాలను నిరోధించామని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చెబుతున్నా, అక్కడి పరిస్థితులు మాత్రం వేరుగా ఉన్నాయి. తాజాగా సుమారు 500 గ్రాముల హై-గ్రేడ్ నార్కోటిక్ డ్రగ్స్‌ను మోసుకెళతున్న పాకిస్థాన్ డ్రోన్‌ను జమ్ముకాశ్మీర్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వద్ద బిఎస్ఎఫ్ సిబ్బంది స్వాధీనం చేసుకోవడం కలకలం సృష్టిస్తోంది. ఆర్నియా సెక్టార్‌లోని చైనాజ్ బోర్డర్ అవుట్‌పోస్టు ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి సరిహద్దు దాటి భారత్‌లో ప్రవేశించిన డ్రోన్‌ను బిఎస్ఎఫ్ దళాలు గుర్తించి, స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు ఆదివారం తెలిపారు. 495 గ్రాముల డ్రగ్స్‌తో ఉన్న డ్రోన్‌ను అడ్డుకోవడం ద్వారా పాక్ స్మగ్లింగ్ ప్రయత్నాన్ని బిఎస్ఎఫ్ విఫలం చేసిందని తెలిపారు. దేశ వ్యతిరేకుల దుర్మార్గపు ప్రణాళికను బిఎస్ఎఫ్ సిబ్బంది యొక్క అంకితభావం, జాగరూకత మరోసారి ఓడించిందని, దేశ భద్రత పట్ల బిఎస్ఎఫ్ సిబ్బంది అచంచలమైన నిబద్ధతను ఈ ఘటన చాటి చెప్పిందని పేర్కొన్నారు.



పతకాలు సాధించిన రాష్ట్ర విద్యార్థులు

జాతీయ స్కూల్ గేమ్స్‌లో రాష్ట్ర విద్యార్థుల సత్తా

- కరాటేలో దినేష్‌కు స్వర్ణం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జాతీయ స్కూల్ గేమ్స్‌లో రాష్ట్రానికి చెందిన పలువురు విద్యార్థులు పతకాల పంట పండించారు. ఈ నెల 9 నుంచి 15 వరకు ఢిల్లీలో 68వ జాతీయ స్కూల్ గేమ్స్‌లో భాగంగా నిర్వహించిన కరాటే, బ్యాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్ క్రీడల్లో విద్యార్థులకు పతకాలు దక్కినట్లు రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి భానుమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కరాటే అండర్-17 బాలురు విభాగంలో కర్నూలు జిల్లా సిస్టర్ స్టానలిస్ట్ మెమోరియల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన మన్నెపు వెంకట దినేష్ 66 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించారు. 45 కేజీల విభాగంలో ప్రకాశం జిల్లా ఓం సాయి వికాస్ విద్యానికేతన్ హైస్కూల్‌కు చెందిన జవంగుల కాశీసాయి చంద్రభార్గవ్ కాంస్య పతకం సాధించారు. బ్యాడ్మింటన్ అండర్-14 బాలురు విభాగంలో తణుకుకు చెందిన వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన సమ్మెట్ల హేమంత్, మిగతా 5లో

అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి పిలుపు
- కృష్ణా జిల్లా 25వ మహాసభ ప్రారంభం



సిపిఎం కృష్ణాజిల్లా 25వ మహాసభ సందర్భంగా చల్లపల్లిలో నిర్వహిస్తున్న భారీ ర్యాలీ (ఇన్‌సెట్‌లో) బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

చల్లపల్లి జమీందారీ వ్యతిరేక పోరాట అమరవీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై బలమైన ఉద్యమాలను నిర్మించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి పిలుపునిచ్చారు. చల్లపల్లి జమీందారీ వ్యతిరేక పోరాట ఫలితంగా 10 వేల మందికి భూములు, 7,500 మందికి ఇళ్ల స్థలాల పంపిణీ జరిగిందని గుర్తు చేశారు. సిపిఎం కృష్ణా జిల్లా 25వ మహాసభలో భాగంగా ఆదివారం చల్లపల్లిలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ జరిగింది. అమరవీరు స్థూపం నుంచి ఎటిఎం సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అమరవీరుల పేరుతో ఎడ్ల బండ్లు, ట్రాక్టర్, ఆటోలపై తీసుకొచ్చిన ప్రభలు, తీన్మార్, డప్పు వాయిద్యాలు, రెడ్ షర్ట్లు, మహిళలు ఎర్ర చీరలతో వలంటీర్ల కవాతుతో ప్రదర్శన సాగింది. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు అధ్యక్షతన జరిగిన సభలో పుణ్యవతి మాట్లాడుతూ.. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరిచి ప్రజలపై భారాలు మోపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన ఐదు నెలల కాలంలోనే సర్దుబాటు ఛార్జీల పేరుతో ఒక్కో కుటుంబంపై వేలాది రూపాయల విద్యుత్ భారం మోపిందని తెలిపారు. తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు పెట్టుబడి సాయం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళలకు నెల నెలా రూ.1500 పింఛను తదితర ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపుతోందన్నారు. అమరావతిని చూపి మురిపించడం తప్ప విజయవాడ ఆటోనగర్ లాంటి ప్రాంతంలో చిన్న పరిశ్రమల మనుగడకు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులను, పాఠశాలలను నిర్లక్ష్యం చేస్తోందని, ప్రయివేటు వైద్యం, విద్య ప్రజలకు తీవ్ర భారంగా మారాయని తెలిపారు. రాష్ట్రంలో మద్యం, గంజాయి, డ్రగ్స్ వాడకం పెరిగి అసాంఘిక శక్తులు పెట్రేగుతున్నాయని, దీంతో మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని చెబుతున్న పాలకులు దీనికి అవసరమైన ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ నిధులను కేంద్రం నుంచి రాబట్టడంలో విఫలమయ్యారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అంబానీ, అదానీలకు భజన చేస్తోందన్నారు. రాష్ట్రంలో కృష్ణపట్నం, గంగవరం పోర్టులను అదానీపరం చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, ధరల నియంత్రణ నుంచి వైదొలగి మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చిందని తెలిపారు. రాష్ట్రానికి అవసరమైన వాటి గురించి ప్రశ్నించి కేంద్రం నుంచి నిధులు రాబట్టకుండా చె గువేరా బొమ్మ వేసుకుని తిరిగిన నాయకుడు సనాతన ధర్మం పరిరక్షణ పేరుతో మత విద్వేషాలకు ఆస్కారం కల్పిస్తున్నారని విమర్శించారు. సనాతన ధర్మం అట్టడుగు వర్గాలైన దళిత, గిరిజనుల అభివృద్ధికి, వారి నివాస ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎంత వరకు పనికొస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఫ్యాక్టరీలు పెట్టి అందరికీ ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి 2015 నాటికి 7.50 లక్షల ఎకరాలు భూములను రైతుల నుంచి లాక్కున్నారని, యువతకు సరైన ఉద్యోగాలు దక్కలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, సిపిఎం కృష్ణా జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కళ్లం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు గవర్నర్ నివాళి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటులో పొట్టి శ్రీరాములు కీలక పాత్ర పోషించారని, అత్యున్నత త్యాగం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జాయింట్ సెక్రటరీ పి సూర్యప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియం గడువు పెంచాలి

- ఎపి రైతు సంఘం విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పంటల బీమా ప్రీమియం చెల్లించేందుకు డిసెంబర్ చివరి వరకు గడువు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కోరింది. ఈ మేరకు వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు, అధికారులకు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఒక లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. 2024-25 రబీ సీజన్‌కు సంబంధించి ఉత్తరాంధ్ర జిల్లాల్లో మామిడి, జీడిమామిడి ఇతర పంటలకు, రాష్ట్రవ్యాప్తంగా రబీ పంటలకు ప్రీమియం చెల్లించేందుకు రైతులకు డిసెంబర్ 15 వరకు గడువుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. గడువు ముగుస్తుందనే సమాచారం రైతులందరికీ చేర్చలేదని, దీంతో చాలా మంది చెల్లించలేకపోయారని పేర్కొన్నారు. సమాచారం ఉన్నా ఆన్‌లైన్‌లో వచ్చిన సమస్యల వల్ల చెల్లించేందుకు కొంతమందికి ఆటంకాలు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయశాఖ పంటల బీమా ప్రీమియం చెల్లించే గడువును డిసెంబర్ చివరి వరకు పొడిగించాలని కోరారు. పంటల బీమా ప్రయోజనం రైతులకు విస్తృతంగా కలగాలంటే గడువు పెంచే విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు.



స్టేజ్ కూలడంతో కింద పడిన నాయకులు

కుడా చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవంలో అపశృతి

- స్టేజ్ కూలి పలువురికి గాయాలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ఇటీవల నామినేటెడ్ పదవుల్లో భాగంగా కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్‌గా నియమితులైన తుమ్మల రామస్వామి ప్రమాణ స్వీకారంలో ఆదివారం అపశృతి చోటుచేసుకుంది. కాకినాడలోని నాగమల్లితోట కాపు కల్యాణమండపంలో ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, జనసేన ఎమ్మెల్సీ హరిప్రసాద్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, మహిళా నేత హారికతో పాటు పలువురు స్టేజిపై ఉండగా స్టేజ్ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. దీంతో స్టేజిపై ఉన్న నాయకులు కింద పడిపోయారు. స్టేజ్ ఎత్తు తక్కువగా ఉండడంతో పెను ప్రమాదం తప్పి వారంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. నిమ్మకాయల చినరాజప్పను దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. ఒక జనసేన నాయకురాలి కాలికి, ఒక పోలీస్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. వేదికపైకి సుమారు 30 మంది వరకు మాత్రమే అవకాశం ఉంటే దాదాపు 70 మంది వేదిక ఎక్కడంతో ఈ ప్రమాదం జరిగిందని చెప్తున్నారు. ఎమ్మెల్యే పంతం నానాజీకి, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామికి స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన తర్వాత యథావిధిగా ప్రమాణ స్వీకారం కొనసాగింది.

కవుల గొప్పతనాన్ని తెలియజేసేలా
తెలుగు సాహితీ యాత్రలు : పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కవులు, రచయితల గొప్పతనాన్ని తెలియజేసేలా తెలుగు సాహితీ యాత్రలు నిర్వహించేందుకు వీలుగా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. మంగళగిరి క్యాంపు కార్యాలయంలో ఆదివారం విజయవాడ బుక్ ఫెస్టివల్ కమిటీ ప్రతినిధులు.. డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రతినిధుల బృందం సభ్యులు టి మనోహర్ నాయుడు, కె లక్ష్మయ్య, గోళ్ల నారాయణరావు, సందీపని మాట్లాడుతూ.. విజయవాడలో గత 35 ఏళ్లుగా పుస్తక మహోత్సవాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. కొన్నేళ్లుగా పుస్తక మహోత్సవ నిర్వహణకు అవసరమైన మైదానం కూడా పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ స్పందిస్తూ.. ఈ సమస్యను పరిష్కరిస్తామన్నారు. శ్రీశ్రీ, గురజాడ, చలం, గుర్రం జాషువా, విశ్వనాథ సత్యనారాయణ, తిలక్, దేవులపల్లి కృష్ణశాస్త్రి వంటి గొప్ప కవులు, రచయితల స్వస్థలాలు, అక్కడ వారి జ్ఞాపకాలను కాపాడటం ద్వారా వారి సాహిత్య సేవలు తెలిపే స్మారక కేంద్ర నిర్మాణాలు చేపట్టడం ద్వారా ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేయొచ్చన్నారు. వేటపాలెం, రాజమహేంద్రవరం గౌతమి గ్రంథాలయం, కడప సిపి బ్రౌన్ గ్రంథాలయం వంటి ప్రముఖ గ్రంథాలయాలు రాష్ట్రంలో అనేకం ఉన్నాయన్నారు. వీటిని కవులు, రచయితల నివాసాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్స్ ఏర్పాటు చేయవచ్చన్నారు. ఈ విధంగా చేయడం ద్వారా తెలుగు భాష అభివృద్ధితో పాటు పర్యాటక రంగం విస్తరణకు దోహదపడుతుందన్నారు. ఈ అంశంపై భాషా సాంస్కృతికశాఖ, పర్యాటక శాఖలు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాలనే దిశగా తమ ప్రభుత్వం ఆలోచనలు చేస్తుందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

చేనేత రంగానికి ప్రాధాన్యత

- కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చేనేత కార్మికుల ఆర్థిక స్థితిని మెరుగుపరచడంపై ప్రాధాన్యత చూపుతామని, మార్కెట్ నెట్‌వర్క్ విస్తరణ, చేనేత ఉత్పత్తులకు న్యాయమైన ధర నిర్ధారణ చేసేందుకు ప్రయత్నిస్తామని కేంద్ర చేనేత, జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత శాఖ మంత్రి ఎస్.సవిత, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణిలతో కలిసి చేనేత, ఆప్కో, టెక్స్‌టైల్స్ రంగాల అభివృద్ధిపై సంబంధిత అధికారులతో ఆదివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత కార్మికుల ఆరోగ్యం, విద్య అవసరాల కోసం ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు. చేనేత కార్మికులు మగ్గాలను ఏర్పాటు చేసుకొనేందుకు కావలసిన నిధులను మంజూరు చేస్తామన్నారు. చేనేత, హస్త కళలపై సంపదను సృష్టించే అంశంపై సమీక్షించి అభివద్ధికి కషి చేస్తామని, టెక్స్‌టైల్స్, కలంకారి, హస్తకల అభివృద్ధికి అన్ని విధాల రాష్ట్ర ప్రభుత్వానికి సహకరిస్తామని తెలిపారు. మంత్రి సవిత మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత పరిశ్రమలకు పూర్వ వైభవం తీసుకొస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సద్వినియోగం చేసుకుంటే చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆప్కో హ్యాండ్లూమ్స్ వైస్ చైర్మన్ అండ్ మానేజింగ్ డైరెక్టర్ ఎం.విశ్వ, హ్యాండ్ లూమ్స్ టెక్స్‌టైల్స్ అడిషనల్ డైరెక్టర్ శ్రీకాంత్ ప్రభాకర్, అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బిజెపిని ఎదుర్కొనేందుకు ఐక్య ఉద్యమాలు

సిపిఎం గుంటూరు జిల్లా మహాసభలో సిహెచ్.బాబూరావు పిలుపు

ప్రజాశక్తి-గుంటూరు

బిజెపి విధానాలను సైద్ధాంతికంగా ఎదుర్కొనడానికి వామపక్ష, లౌకిక శక్తులను కలుపుకొని ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు పిలుపునిచ్చారు. గుంటూరులో రెండు రోజులపాటు జరిగిన సిపిఎం గుంటూరు జిల్లా 25వ మహాసభ ఆదివారంతో ముగిసింది. చివరి రోజు సభలో సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రజా సమస్యలపై విస్తృతంగా క్షేత్రస్థాయి ఉద్యమాలు చేపట్టాలని, ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి మతోన్మాదం దేశాన్ని పట్టి పీడిస్తోందని, రాజ్యాంగ వ్యవస్థలను చెప్పు చేతల్లోకి తీసుకొని ఆడించే ప్రయత్నం చేస్తోందని, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తోందని వివరించారు. ముఖ్యంగా రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలోని టిడిపి, జనసేనతోపాటు, ప్రతిపక్ష వైసిపి కూడా రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంతో విఫలమయ్యాయని తెలిపారు. బూర్జువా పార్టీలు ధన రాజకీయాన్ని, అవినీతిని పెంచి పోషిస్తున్న నేపథ్యంలో చారిత్రక వారసత్వం ఉన్న కమ్యూనిస్టుల బలం పెరగాల్సిన అవసరముందని తెలిపారు. పాలక పార్టీలు అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లాలో రాజధాని ఏర్పాటు చేసిన నేపథ్యంలో దాని అభివృద్ధికి, ప్రజారాజధాని సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం మతం పేరుతో ప్రజల్లో విభజన తెస్తున్న నేపథ్యంలో కమ్యూనిస్టులు ప్రత్యామ్నాయ సంస్కృతిని,



మాట్లాడుతున్న రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

సమైక్య సంస్కృతిని పెంపొందించేందుకు కృషి చేయాల్సిన అవసరముందని తెలిపారు.

అన్ని మతాలు, కులాలు కలిసి జీవిస్తున్న విధానాన్ని, సమానత్వ భావనను బలోపేతం చేయాల్సిన అవసరముందని తెలిపారు.

21 తీర్మానాలు ఆమోదం

రైతుల సమస్యలు పరిష్కరించాలని, గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకూ పొడిగించటానికి వెంటనే భూసేకరణకు రూ.120 కోట్లు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇళ్ల స్థలాలు లేని వారికి నివాస స్థలాలు, ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న వారి ఇళ్లను క్రమబద్ధీకరించాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి మినహాయించాలని, ఇసుక కొరత నివారించి ఇసుకను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మహాసభలో తీర్మానాలను ఆమోదించారు. విద్యుత్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీల భారం తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా విస్తృతంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని మహాసభ పిలుపునిచ్చింది. మొత్తం 21 తీర్మానాలను ఆమోదించారు.

నూతన కార్యదర్శిగా వై.నేతాజి



జిల్లా కమిటీ సభ్యులుగా 21 మంది, నూతన కార్యదర్శిగా వై.నేతాజి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా పాశం రామారావు, ఎన్.భావన్నారాయణ, కె.నళినీకాంత్, ఎం.రవి, ఈమని అప్పారావు, బి.వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

జర్నలిస్టులకు మోహన్‌బాబు క్షమాపణలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో



జల్‌పల్లిలోని తన నివాసం వద్ద జరిగిన ఘటనలో తాను ఉద్దేశపూర్వకంగా మీడియా ప్రతినిధిని కొట్టలేదని నటుడు మోహన్‌బాబు ఆదివారం మరోసారి వివరణ ఇచ్చారు. జర్నలిస్టులకు క్షమాపణలు చెప్పారు. చికిత్స పొందుతున్న జర్నలిస్టు రంజిత్‌ను ఆదివారం సాయంత్రం సోమాజిగూడ యశోద ఆస్పత్రికి వెళ్లి మోహన్‌బాబు, ఆయన కుమారుడు మంచు విష్ణు పరామర్శించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు కుటుంబ సభ్యులకు మోహన్‌బాబు క్షమాపణ చెప్పారు. జల్‌పల్లిలో మోహన్‌బాబు నివాసం వద్ద మంగళవారం రాత్రి మనోజ్‌తో పాటు మీడియా సిబ్బంది కూడా ఆ ఇంట్లోకి వెళ్లారు. ఈ ఉద్రిక్తతల నడుమ మోహన్‌బాబు తీవ్ర అసహనానికి గురై చేయిచేసుకోవడంతో జర్నలిస్ట్ రంజిత్ గాయపడ్డారు.

విద్యుత్ భారాలపై దశలవారీ ఆందోళనలు

సిపిఎం ఏలూరు జిల్లా మహాసభలో మంతెన సీతారాం



మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం (ఏలూరు జిల్లా)

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపిన విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా దశలవారీగా ఆందోళనలు ఉధృతం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. బుట్టాయగూడెంలోని ఆర్.సత్యనారాయణ రాజు (ఆర్ఎస్) స్మారక ప్రాంగణంలో సిపిఎం ఏలూరు జిల్లా 26వ మహాసభ ఆదివారంతో ముగిసింది. మహాసభనుద్దేశించి మంతెన సీతారాం మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు విరుద్ధంగా టిడిపి కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని, దీనికి విద్యుత్ భారాలే నిదర్శనమని తెలిపారు. ఈ భారాలను తిప్పికొట్టేలా విద్యుత్ ఉద్యమం పెద్దఎత్తున చేపట్టనున్నట్లు వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యపర్చేలా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలతో మరింత మమేకమై స్థానిక సమస్యలు పరిష్కారమయ్యే వరకూ వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టాలని సూచించారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న పార్టీలు విభజన హామీల అమలుపై కేంద్రాన్ని నిలదీయక పోవడం బాధాకరమన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం నిర్వాసితులకు పరిహారం, పునరావాసం, విశాఖ రైల్వేజోన్ వంటివి కేంద్రం చేతిలోనే ఉన్నాయని తెలిపారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రోజుకో రీతిన మాట్లాడటం దురదృష్టకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో విజన్ 2020 అని, ఇప్పుడు విజన్ 2047 అంటూ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించి మోసగిస్తున్నారని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా మహాసభ కర్తవ్యాల అమలుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఇప్పటికే సాగుతున్న అసంఘటితరంగ కార్మికుల పోరాటాలను విస్తృతం చేయాలన్నారు. మద్యం మహమ్మారి వల్ల మహిళలు ఎదుర్కొంటున్న సమస్యను పరిశీలించాలని, వాటిపై దశలవారీగా ఆందోళనలు చేపట్టాలని కోరారు. పామాయిల్ సాగులో జిల్లా జాతీయస్థాయిలోనే అగ్రస్థానంలో ఉందని, అయితే, దానిలో పని చేసే పామాయిల్ కార్మికుల స్థితిగతులు మాత్రం అత్యంత బాధాకరంగా ఉన్నాయని తెలిపారు. వివిధ తరగతుల ప్రజల సమస్యలపై, స్థానిక సమస్యలపై కేంద్రీకరించి పని చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి ఎ.రవి.. కార్యకలాపాల నివేదికపై చర్చలకు సమాధానం ఇచ్చారు. మహాసభ పలు అంశాలపై తీర్మానాలు ఆమోదించింది.

జిల్లా కార్యదర్శిగా ఎ.రవి



జిల్లా కమిటీకి 24 మంది, జిల్లా కార్యదర్శిగా ఎ.రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, తెల్లం రామకృష్ణ, మొడియం నాగమణి, జి.రాజు, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మోడీ భజనకే విజన్-2047

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మోడీ వికసిత్ భారత్‌కు భజనలా సిఎం చంద్రబాబు ప్రకటించిన విజన్-2047 ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. గతంలో విజన్-2020 అని ఊదరగొట్టారని, దీనివల్ల పేద, ధనిక వర్గాల మధ్య తారతమ్యం ఏమాత్రం తగ్గలేదన్నారు. విజయవాడలోని దాసరి భవన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. ఎన్నికల్లో చేసిన సూపర్‌సిక్స్ వాగ్దానాల్లో భాగంగా రైతులకు రూ.20 వేలు ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, మహిళలకు నెలకు రూ.1,500 వంటి పథకాలను అమలు చేయడంలో సిఎం శ్రద్ధ చూపడం లేదన్నారు. 2047 నాటికి తలసరి ఆదాయాన్ని 47 వేల డాలర్లు చేస్తామని, పేద, ధనిక వర్గాల మధ్య అంతరాన్ని తగ్గిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో 15 ఏళ్లు సిఎంగా చంద్రబాబు పని చేసినప్పుడు పేద, ధనిక వర్గాల మధ్య తారతమ్యం ఏమి తగ్గిందని ప్రశ్నించారు. మోడీ అధికారంలోకి వచ్చిన అనంతరం దేశంలో 500 మంది బిలియనీర్ల సంపద విపరీతంగా పెరిగిందన్నారు. కార్పొరేట్లకు మోడీ ఊడిగం చేయడం వల్లే అదాని, అంబానీలు ప్రపంచ కుబేరులుగా మారారని విమర్శించారు. ప్రభుత్వం రూపొందించిన విజన్-2047 డాక్యుమెంట్‌పై సమగ్ర చర్చ జరగాలని, అఖిలపక్షాలు, మేధావులు, ఆర్థికవేత్తలతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించాలని డిమాండ్ చేశారు. పుష్ప-2 సినిమా విడుదల రోజు తొక్కిసలాటలో మహిళ చనిపోవడం బాధాకరమని, ఆమె తొమ్మిదేళ్ల కుమారుడు చావుబతుకుల మధ్య ఆస్పత్రిలో ఉన్నాడని, అతనిని పరామర్శించకుండా కేంద్ర మంత్రి బండి సంజయ్, మాజీ సిఎం జగన్ హీరో అల్లు అర్జున్‌కు వత్తాసు పలకడాన్ని తప్పుబట్టారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జెల్లి విల్సన్, అక్కినేని వనజ, ఎఐకెఎస్ జాతీయ నాయకులు వెంకయ్య పాల్గొన్నారు.

నేడు సిఎం పోలవరం పర్యటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం సందర్శించనున్నారు. ప్రాజెక్టు ప్రాంతంలోని గ్యాప్ వన్, టూ, డీ వాల్ నిర్మాణ పనులు, వైబ్రో కాంపాక్షన్ పనుల పురోగతిపై వివరాలు తెలుసుకుంటారు. అనంతరం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్‌తోపాటు నిర్మాణ పనులపై అక్కడే అధికారులతో సమీక్ష నిర్వహించి విలేకరుల సమావేశంలో మాట్లాడతారు. ఈ మేరకు సిఎం పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో పోలవరం ప్రాంతానికి చేరుకుంటారు.. పర్యటన అనంతరం అక్కడి నుంచి హెలికాప్టర్‌లో నేరుగా సచివాలయానికి చేరుకుంటారు.

అమరావతిలో సాఫ్ట్‌వేర్ సంస్థలు తీసుకొస్తాం

- కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గూగుల్, మైక్రోసాఫ్ట్, ఆపిల్ వంటి విశిష్ట కంపెనీలను అమరావతికి తీసుకొచ్చి విభిన్న ఫలితాలు రాబట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఇన్నోవేషన్ ఆఫ్ గూగుల్ సర్టిఫికేషన్ ప్రోగ్రాంలో భాగంగా గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరులోని వివిఐటి కాలేజీలో ఏర్పాటు చేసిన గూగుల్ అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆంధ్రప్రదేశ్ పైలెట్ ప్రాజెక్టును ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ.. స్కిల్ హబ్‌లో భాగంగా గూగుల్‌తో ఒప్పందం చేసుకున్నట్టు తెలిపారు. ముందుగా వివిఐటిలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఐటిలో మంచి ఫలితాలు సాధించవచ్చని, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిఐటి విద్యా సంస్థల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వివిఐటి ప్రొఫెసర్ అండ్ అకడమిక్స్ డీన్ డాక్టర్ గిరిబాబు కందె, గూగుల్ (ఇండియా) డెవలపర్ ఎకో సిస్టమ్ లీడ్ కార్తీక్ పద్మనాభన్, గూగుల్ స్టార్టప్ ఆక్సిలేటర్ పాల్ రవీంద్రనాథ్, జోబేజ్ సంస్థ వ్యవస్థాపకులు, సిఇఒ కార్తీక్, హోమ్ గ్రౌండ్ వ్యవస్థాపకులు సంతోష్ ఉప్పాల తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణపై ద్వంద్వ వైఖరి తగదు

మాలల గర్జన సభలో పలువురు వక్తలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పెరుగుతున్న జనాభాను ప్రాతిపదికన చేసుకొని ఎస్‌సిలకు 25 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, వర్గీకరణపై రాజకీయ పార్టీలు ద్వంద్వ వైఖరి విడనాడాలని మాల మహానాడు నాయకులు కోరారు. ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా గుంటూరుకు సమీపంలోని నల్లపాడు వద్ద మాలల మహాగర్జన సభ ఆదివారం రాత్రి జరిగింది. సభలో తెలంగాణకు చెందిన మాజీ మంత్రి జి.వివేక్ మాట్లాడుతూ అంబేద్కర్ రిజర్వేషన్లు తీసుకొచ్చినప్పుడు మాల, మాదిగల మధ్య తేడా చూపలేదన్నారు. దళితుల్లో చిచ్చు పెట్టేందుకే వర్గీకరణ తీసుకొచ్చారని తెలిపారు. కొందరికి అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఉందన్నారు. ఎపిలో మొదటి స్థానంలో, తెలంగాణలో రెండో స్థానంలో మాలలు ఉన్నారని, ఎస్‌సి వర్గీకరణతో సంబంధం లేకుండా రిజర్వేషన్ శాతాన్ని 25కు పెంచాలని డిమాండ్ చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ మాలలే రిజర్వేషన్ల ఫలాలు పొందుతున్నారని తప్పుడు ప్రచారం చేశారన్నారు. రిజర్వేషన్లు లేకపోతే అస్తిత్వం కోల్పోతామని తెలిపారు. మాజీ ఎంపి హర్షకుమార్ మాట్లాడుతూ వర్గీకరణపై చంద్రబాబు ఇప్పటికే పలుమార్లు మోసం చేశారని విమర్శించారు. పార్లమెంట్ చట్ట సవరణ చేయకుండా సుప్రీం కోర్టు ఎలా తీర్పు ఇస్తుందని ప్రశ్నించారు. 341 అధికరణంపై ఎంపీలు చర్చించాలని కోరారు. ఉద్యోగాలన్నీ ప్రయివేటు సెక్టార్‌లోనే ఉన్నాయని, ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు కావాలన్నారు. హైకోర్టు న్యాయవాది జడా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాధికారం దక్కకుండా ఉండేందుకు వర్గీకరణ చేశారని తెలిపారు. జమిలి ఎన్నికల్లో చంద్రబాబు ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపేయాలన్నారు.

చిరంజీవి ఇంటికి అల్లు అర్జున్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ నటులు చిరంజీవిని అల్లు అర్జున్ ఆదివారం కలిశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం మధ్యాహ్నం చిరంజీవి నివాసానికి వెళ్లిన అల్లు అర్జున్... చిరంజీవి కుటుంబంతో గంటకు పైగా గడిపారు. సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో జైలు నుంచి విడుదలైన తర్వాత తొలిసారి చిరంజీవిని అల్లు అర్జున్ కలిశారు. తాజా పరిణామాలపై వీరు చర్చించుకున్నట్లు తెలిసింది. కేసు విచారణ కొనసాగుతున్నందున గాయపడిన బాలుడు శ్రీతేజ్‌ను కలవలేకపోతున్నానని అల్లు అర్జున్ తెలిపారు. త్వరలోనే వారి కుటుంబాన్ని కలిసి మాట్లాడతానని, వారిని ఆదుకుంటానని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నానని చెప్పారు. శ్రీతేజ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నానని సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు.

టిడిపి గ్రీవెన్స్ నాయకుల జాబితా విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమానికి ఈ నెల 16 నుంచి 28 వరకు హాజరయ్యే మంత్రులు, పార్టీ నేతల జాబితాను పార్టీ కార్యాలయం ఆదివారం విడుదల చేసింది. ఈ నెల 16న కెఎస్ జవహర్, దేవినేని ఉమా మహేశ్వరరావు, పిల్లి మాణిక్యాలరావు నిర్వహించనున్నారు. 17న ఎమ్‌డి షరీఫ్, వర్ల రామయ్య, దీపక్ రెడ్డి పాల్గొంటారు. 18న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, బిటి నాయుడు, మల్ల సురేంద్ర, 19న పంచుమర్తి అనురాధ, గండి బాబ్జి నిర్వహిస్తారు. 20న పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్, మంత్రి ఎస్ సవిత, గొట్టిముక్కల రఘురామరాజు, 21న పల్లా శ్రీనివాస్ యాదవ్, మంత్రి కొలుసు పార్థసారథి, ఆనం వెంకటరమణ రెడ్డి పాల్గొంటారు. 23న దువ్వారపు రామారావు, రవినాయుడు, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, 24న మంత్రి గుమ్మడి సంధ్యారాణి, మంతెన రామరాజు, శావల దేవదత్ నిర్వహిస్తారు. 26న మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి, రెడ్డి సుబ్రహ్మణ్యం, పీలా గోవింద సత్యనారాయణ, 27న పల్లా శ్రీనివాస్ యాదవ్, మంత్రి పొంగూరు నారాయణ, రూడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొంటారు. 28న పల్లా శ్రీనివాస్ యాదవ్, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, బోరగం శ్రీనివాసులు నిర్వహిస్తారు.



సేవ్ ది గర్ల్ చైల్డ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న హోం శాఖ మంత్రి అనిత

ఆడపిల్లలే జాతికి నిజమైన సంపద

- సేవ్ ద చైల్డ్ కార్యక్రమంలో హోంమంత్రి అనిత

ప్రజాశక్తి - పాలకొల్లు

ఆడ పిల్లలు జాతికి నిజమైన సంపద అని, ఆ సంపదను కాపాడుకోటానికి ప్రతి ఒక్కరూ కలిసి రావాలని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో 'సేవ్ ది గర్ల్ చైల్డ్' పేరుతో నిర్వహించిన 2కె రన్ కార్యక్రమాన్ని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణితో కలిసి ఆమె ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హోంమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే గంజాయి, మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపామన్నారు. ఈగల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి ఎక్కడికక్కడా తనిఖీలు నిర్వహించి, మత్తు పదార్థాల నుంచి యువతను విముక్తిని చేసి సన్మార్గంలో పెట్టేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. ఆడ పిల్లలను రక్షించాలనే లక్ష్యంతో మంత్రి నిమ్మల రామానాయుడు చేపట్టిన ఈ కార్యక్రమం అందరికీ ఆదర్శనీయమని తెలిపారు. మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ మహిళలను గౌరవించాలన్నారు. ఆడపిల్లలను రక్షిద్దాం.. సమాజాన్ని కాపాడుకుందామని పేర్కొన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ బాలికలు, మహిళలకు సమస్యలు ఎదురైతే వాటిని ఎలా ఎదుర్కొవాలో తెలియని పరిస్థితిలో ఉంటారని, అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు.

విశాఖ మార్కెట్లో ధరతి బ్రో ఎలక్ట్రిక్ వాహనం



నూతన ఎలక్ట్రిక్ వాహనంతో ధరతి గ్రీన్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ అండ్ ఎమ్‌డి డాక్టర్ డి జైభారత్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ (విశాఖ)

విశాఖపట్నం కేంద్రంగా నిర్మితమైన ఎలక్ట్రికల్ వాహనం ధరతి బ్రోను ఆదివారం ధరతి గ్రీన్ ప్రయివేట్ లిమిటెడ్ చైర్మన్ అండ్ ఎండి డాక్టర్ డి జైభారత్ విడుదల చేశారు. విశాఖపట్నం సిరిపురంలోని ఓ హోటల్‌లో జరిగిన వాహన ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ తమ వాహనం ప్రత్యేకమైన డిజైన్ కలిగి, ప్లాస్టిక్ భాగాలు లేకుండా పూర్తి మెటల్ బాడీతో నిర్మితమైందని చెప్పారు. 2.2 కిలోవాట్ల పీక్ పవర్ బిఎల్‌డిసి మోటార్ 2.4 కిలోవాట్ బ్యాటరీ ప్యాక్‌తో వంద కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుందని తెలిపారు. భారతదేశంలో మొదటిసారిగా ద్విచక్ర వాహనంలో రైడర్, పిలియన్ రైడర్‌కు ఒక మీటరు పొడవు ఫుట్ రెస్ట్‌తో వస్తుందని వివరించారు. పార్కింగ్, 3-స్పీడ్ మోడ్స్ (ఎకో, నార్మల్, స్పోర్ట్), క్రూస్ మోడ్, రివర్స్ మోడ్, వాక్ అసిస్ట్ మోడ్, పవర్ సేవింగ్ మోడ్, సైడ్ స్టాండ్ సెన్సార్, యాంటీ థెఫ్ట్, డౌన్ హిల్, అప్-హిల్, స్టాల్-హాల్ట్, రీజెనరేటివ్ బ్రేకింగ్, రీజెనరేటివ్ థ్రోటిల్, హిల్ అసిస్ట్, యుఎస్‌బి ఛార్జింగ్, సిబిఎస్ ఫీచర్లతో మార్కెట్లో లభిస్తుందని ఆయన తెలిపారు.

'ప్రకాశం' అభివృద్ధికి రూ.10 వేల కోట్లు

- ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జిల్లా మహాసభ తీర్మానం
- కార్మిక, కర్షక సమస్యలపై పోరాటం : వి శ్రీనివాసరావు పిలుపు
- 26 మందితో జిల్లా కమిటీ ఎన్నిక
- ముగిసిన సిపిఎం ప్రకాశం జిల్లా మహాసభ



మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- చీమకుర్తి, ఒంగోలు బ్యూరో

రైతులు, కార్మికులు, కష్టజీవుల సమస్యలను అధ్యయనం చేసి.. వాటి పరిష్కారానికి పోరాడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. చీమకుర్తిలో మూడు రోజులపాటు జరిగిన సిపిఎం ప్రకాశం జిల్లా 14వ మహాసభ ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు సభలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ భవిష్యత్తు కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. ప్రజాసమస్యలపై రానున్న కాలంలో కేంద్రీకరించి పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. మహాసభలో ఆమోదించిన తీర్మానాలు అమలు జరిగేలా దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఆయా సమస్యలు పాలకవర్గాల దృష్టికి వెళ్లేలా ప్రజలను సమీకరించి పోరాడాలని పిలుపునిచ్చారు. సమస్యలను పక్కదారి పట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం మతోన్మాద అజెండాను అమలు చేస్తోందని, దీనిపై ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు.

32 తీర్మానాలు ఆమోదం

వెనుకబడిన జిల్లాగా ప్రకటించిన ప్రకాశం జిల్లా అభివృద్ధికి పది వేల కోట్ల రూపాయలు కేటాయించాలని, మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేసి వచ్చే ఖరీఫ్‌కు సాగు నీరు అందించాలని, జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మహాసభలో తీర్మానాలను ఆమోదించారు. విద్యుత్ ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి ఆందోళన చేపట్టాలని నిర్ణయించారు. గ్రానైట్, డిజైన్ ప్లేట్ పరిశ్రమను సంక్షోభం నుండి కాపాడాలని, కార్మికుల ఉపాధిని నిలబెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానాన్ని ఆమోదించారు. దళిత, గిరిజన, బలహీన వర్గాలు మైనార్టీలపై దాడులను, మహిళలు, బాలికలపై లైంగిక వేధింపులు, హింస, అత్యాచారాలను అరికట్టాలని తీర్మానించారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు అదుపు చేయాలని, విద్యుత్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీల భారాన్ని ఉపసంహరించాలని, స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయరాదని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానాన్ని ఆమోదించింది. మొత్తం 32 తీర్మానాలకు మహాసభ ఆమోదం తెలిపింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కె.సుబ్బరామమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ఉమామహేశ్వరరావు మహాసభను పర్యవేక్షించారు.

కార్యదర్శిగా ఎస్‌కె మాబు



26 మందితో నూతన కమిటీ, కార్యదర్శిగాఎస్‌కె మాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శివర్గ సభ్యులుగా సయ్యద్ హనీఫ్, పూనాటి ఆంజనేయులు, జివి.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, ఎం.రమేష్, డి.సోమయ్య ఎన్నికయ్యారు.

వ్యవస్థల వైఫల్యంతోనే 'సాయిబాబా' మృతి

- ఇష్టానుసారంగా ఉపా, రాజద్రోహం కేసులు
- సదస్సులో విశ్రాంత ప్రొఫెసర్ హరగోపాల్



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

దేశం ఫాసిజానికి దగ్గరవుతోందని, అభ్యుదయవాదులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందని ప్రముఖ విశ్రాంత అధ్యాపకులు, పౌరహక్కుల వేత్త హరగోపాల్ పేర్కొన్నారు. కడపలోని హరిత్ హోటల్‌లో వామపక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రముఖ న్యాయవాది బొగ్గుల గురప్ప అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన 'ప్రొఫెసర్ జి ఎన్ సాయిబాబా స్మృతి.. చట్టం అందరికీ సమానమేనా ' అంశంపై హరగోపాల్ ప్రధాన వక్తగా హాజరై మాట్లాడారు. దేశంలో స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం ప్రమాదంలో పడ్డాయన్నారు. రాజ్య స్వభావం మారేకొద్దీ పోరాటాలు పెరుగుతాయనే సంగతిని గుర్తించుకోవాలన్నారు. నిరాధారమైన ఆరోపణలతో ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబాను పదేళ్లపాటు జైలులో పెట్టి, ఆయన విలువైన సమయాన్ని బలి తీసుకున్నారని అన్నారు. విశ్వవిద్యాలయ, న్యాయ వ్యవస్థ, జైలు వ్యవస్థల వైఫల్యం కారణంగా సాయిబాబా మృతి చెందారని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్ మాట్లాడుతూ ఇటీవల ఢిల్లీలో మణిపూర్‌కు చెందిన ఎనిమిది మంది బిజెపి కుకీ ఎమ్మెల్యేలు నిరసన ర్యాలీ నిర్వహించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందన్నారు. మోడీ పదేళ్ల పాలనలో 548 మందిపై రాజద్రోహం కేసులు నమోదు చేసిన ఘనత ప్రపంచ దేశాల్లో ఎక్కడా చోటుచేసుకోలేదని పేర్కొన్నారు. హత్రాస్ ఘటన కవరేజికి వెళ్లిన సిద్ధిఖ్‌కప్పన్ జర్నలిస్టును 712 రోజులు జైలులో నిర్బంధించారన్నారు. అంతకు ముందు సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, రవి ప్రసంగించారు. చివరగా పిహెచ్‌డి స్కాలర్ మల్లెల భాస్కర్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, బుద్ధిస్ట్ కల్చరల్ సొసైటీ నాయకులు కుళాయిస్వామిరెడ్డి, ప్రముఖ వైద్య నిపుణులు ఓబుల్‌రెడ్డి, రాజావెంగల్‌రెడ్డి మహేశ్వరరెడ్డి, ప్రజా సంఘాలు, ఎల్‌ఐసి యూనియన్ నాయకులు, మేధావులు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు పాల్గొన్నారు.

కులగణనతో సామాజిక, ఆర్థిక మార్పులు

- మాజీ రాష్ట్రపతి కెఆర్.నారాయణన్ ఒఎస్‌డి ఎస్ఎన్ సాహు



సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఎన్. సాహు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దేశంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక స్థితిగతుల్లో మార్పు జరగాలంటే కులగణన అవశ్యమని మాజీ రాష్ట్రపతి కెఆర్.నారాయణన్ ఒఎస్‌డి ఎస్ఎన్.సాహు తెలిపారు. అనంతపురంలో రెండు రోజులుగా జరుగుతున్న మానవ హక్కుల వేదిక 10వ రాష్ట్ర మహాసభ ఆదివారంతో ముగిసింది. యాపిల్ ఫంక్షన్ హాలులో జరిగిన ఈ మహాసభలో రెండో రోజు మూడు అంశాలపై సదస్సు జరిగింది. 'కుల గణన ఎందుకు అవసరం' అన్న అంశంపై సాహు ప్రసంగిస్తూ దేశంలో ఇప్పటికీ వివక్ష పూరిత సమాజం ఉందని తెలిపారు. మాజీ రాష్ట్రపతి కెఆర్.నారాయణన్ వంటి వారు కూడా ఈ వివక్షను ఎదుర్కొన్న వారేనన్నారు. ఈ కులవివక్ష రూపాలను సరిగా అర్థం చేసుకోవాలంటే కులగణన జరగాల్సిన అవసరముందని పేర్కొన్నారు. మొదటిసారి కేరళలో ముఖ్యమంత్రిగా నంబూద్రీపాద్ బాధ్యతలు చేపట్టాక అక్కడ కులగణన చేయించారని గుర్తు చేశారు. వివక్ష అన్నది ఒక్క హిందూమతంలోనే కాదని, ఇతర మతాల్లోనూ ఉందని ఆ సర్వేలో స్పష్టమైందన్నారు. 'బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన' అంశంపై స్వతంత్ర జర్నలిస్టు మాలిని సుబ్రమణ్యం మాట్లాడుతూ బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన యధేచ్ఛగా సాగుతోందని విచారం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం బడా కార్పొరేట్ కంపెనీలకు అడవుల్లో ఉన్న విలువైన ఖనిజాన్ని కట్టబెట్టేందుకు ఆదివాసీలను అడవుల నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. గత నెల నవంబరులో 47 మంది అమాయక గిరిజన మహిళలను ఎటువంటి కారణం లేకుండా వారం రోజులపాటు భద్రతా బలగాలు నిర్బంధంలో ఉంచాయని తెలిపారు. ఇక్కడి విషయాలు బయటకు పొక్కకుండా మీడియాను నియంత్రించే ప్రయత్నాలు సాగుతు న్నాయని వివరించారు. నూతన విద్యా విధానంపై రచయిత కొప్పర్తి వెంకట రమణమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం ప్రయివేటీకరణను ప్రోత్సహిం చేదిగా ఉందని తెలిపారు. అదే విధంగా పాఠ్యాంశాలను మార్చి కాషాయీకరణ చేసే చర్యలు అందులో ఉన్నాయని పేర్కొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మానవ హక్కుల వేదిక ఎపి రాష్ట్ర అధ్యక్షుడిగా కెవి.జగన్నాథరావు, ప్రధాన కార్యదర్శిగా వై.రాజేష్, ఉపాధ్యక్షులుగా యుజి.శ్రీనివాసులు, ఎ.రవి, జి.శివనాగేశ్వరరావు, ఎస్.అబ్దుల్ రసూల్, ఎం.శరత్, కార్యదర్శులుగా యుఎం.దేవేంద్రబాబు, బిఎన్.సుబ్బన్న, జి.రోహిత్‌ను ఎన్నుకున్నారు. తెలంగాణ కమిటీ అధ్యక్షులుగా భుజంగరావు, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ తిరుపతి, రెండు రాష్ట్రాల సమన్వయకర్తలుగా ఎస్.జీవన్‌కుమార్, వసంతలక్ష్మి, ఎ.చంద్రశేఖర్, విఎస్.కృష్ణలను ఎన్నుకున్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

కేరళ పట్ల కేంద్రం వివక్ష వీడాలి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

కేరళ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించకుండా వివక్ష పాటిస్తున్నప్పటికీ దేశంలోనే రోల్ మోడల్‌గా కేరళ నిలిచిందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో సిఐటియు, ఎపి రైతు సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కేరళ సంఘీభావ సదస్సు ఆదివారం జరిగింది. ఈ సదస్సులో నర్సింగరావు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ సర్కారు వామపక్ష ప్రభుత్వానికి అడుగడుగునా అడ్డంకులు సష్టించడమే కాకుండా నిధులు ఇవ్వకుండా ప్రభుత్వాన్ని పడగొట్టే చర్యలకు పూనుకుందని, దీన్ని మేధావులు, ప్రజాస్వామ్యవాదులు అడ్డుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కేరళలో వామపక్ష ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భూ సంస్కరణలు అమలు చేసి ప్రతి పేదవాడికి భూమి పంచిందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇస్తున్న రాష్ట్రం కేరళనేనని పేర్కొన్నారు. చౌక దుకాణాల ద్వారా పేదలకు 16 రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తోందని తెలిపారు. విద్య, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు నూరు శాతం అక్షరాస్యత సాధించిన రాష్ట్రం కేరళ అని వివరించారు. కేరళ రాష్ట్రంలోని త్రివేంద్రం విమానాశ్రయాన్ని అదానీకి అప్పగించడానికి పూనుకుంటే వామపక్ష ప్రభుత్వం దాన్ని అడ్డుకుందని తెలిపారు. కేరళలోని భారత పెట్రోల్ సంస్థలకు లాభాలు వస్తుంటే వాటిని కూడా ప్రయివేట్ వ్యక్తులకు ఇవ్వడానికి కేంద్రం పూనుకుంటే.. ప్రయివేట్ వ్యక్తులకు ఇవ్వకుండా తామే నిర్వహించుకుంటామని ప్రకటించిందని పేర్కొన్నారు. వామపక్ష ప్రభుత్వాలకు నిధులు ఇవ్వకుండా బిజెపి, ఆర్ఎస్ఎస్ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తోందని, కేరళలో మతోన్మాద ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ కుట్రలు అక్కడ ప్రజలు ఐక్యంగా ఉండి అడ్డుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణకు అధ్యయన యాత్ర

- జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామారావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో పర్యావరణ వినాశనానికి ప్రభుత్వాలు, కార్పొరేట్‌శక్తులు ప్రయత్నిస్తున్నాయని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రామారావు విమర్శించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రజలంతా సమిష్టిగా పోరాడాల్సిన అవసరముందన్నారు. అందులో భాగంగా చేపడుతున్న ఉత్తరాంధ్ర పర్యావరణ అధ్యయన యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని యుటిఎఫ్ భవనంలో జెవివి రాష్ట్ర పర్యావరణ సబ్ కమిటీ ఆధ్వర్యాన ఉత్తరాంధ్ర జిల్లాల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. జెవివి రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కె రామారావు మాట్లాడుతూ పారిశ్రామిక అభివృద్ధి పేరిట కార్పొరేట్‌శక్తులు పర్యావరణ విధ్వంసానికి పూనుకుంటున్నాయన్నారు. సముద్ర తీరం వెంబడి రసాయనిక పరిశ్రమల రాకతో మత్స్యకారుల జీవనమే ప్రశార్థకంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జెవివి పర్యావరణ సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కెవివి సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె త్రిమూర్తులు రెడ్డి, జెవివి రాష్ట్ర నాయకులు వి రాజగోపాల్, సమతా రాష్ట్ర కన్వీనర్ జి నిర్మల, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. భావితరాలకు పర్యావరణ అవశేషాలను విడిచిపెట్టే స్థితి రాకూడదని పేర్కొన్నారు.



తిరుపతి నగరంలోని బిసి కళాశాల బాలిక హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

బిసి హాస్టళ్లలో సిసి కెమెరాలు

- విద్యార్థులకు భద్రతతో కూడిన విద్య
- పొట్టి శ్రీరాములు పోరాట స్ఫూర్తే నేటి యువతకు ఆదర్శం : మంత్రి సవిత

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

బిసి హాస్టళ్ల విద్యార్థులకు భద్రతతో కూడిన విద్య అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బిసి, ఇడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ప్రతి హాస్టళ్లోనూ, గురుకుల పాఠశాలల్లోనూ ఇన్వర్టర్లతో పాటు సిసి కెమెరాలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఆదివారం తిరుపతిలోని బిసి బాలిక హాస్టల్‌ను మంత్రి సందర్శించారు. హాస్టల్లో ప్రతి గదిని, బాత్ రూమ్‌లను, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లో వెనుకబడిన తరగతుల అభివృద్ధికి తమ ప్రభుత్వం రూ.39 వేల కోట్లకు పైగా కేటాయించామని అన్నారు. ఎపి చరిత్రలోనే ఎన్నడూ లేనంతగా బిసిల అభ్యున్నతికి అత్యధిక నిధులు కేటాయించామని, అందులో భాగంగా బిసి హాస్టళ్ల మరమ్మతులకు రూ.25 కోట్లు కేటాయించామని తెలిపారు. నిరంతరం విద్యుత్ సదుపాయం ఉండేలా హాస్టళ్లలో ఇన్వర్టర్లతో పాటు విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. హాస్టళ్లలో పరిశుభ్రమైన వాతావరణంతో పాటు నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

26 జిల్లాల్లోనూ బిసి భవనాల నిర్మాణం


రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లోనూ బిసి భవనాలు నిర్మించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. 2014-19లో అప్పటి టిడిపి ప్రభుత్వం బిసి భవన్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. ఆ భవనాలన్నీ 70 నుంచి 80 శాతం పూర్తయ్యాయని తెలిపారు. తరవాత వచ్చిన జగన్ ఆ నిర్మాణాలను పట్టించుకోలేదన్నారు. బిసి హాస్టళ్లనూ గాలి కొదిలేశారని విమర్శించారు. అసంపూర్తిగా నిలిచిపోయిన బిసి భవన్లతో పాటు కొత్త జిల్లాల్లోనూ నూతన భవనాలు నిర్మించనున్నామని తెలిపారు. ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాముల వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బిజెపి రాయలసీమ ద్రోహి

- ఫిబ్రవరి నుంచి 'ఉక్కు'పై ఉద్యమం
- టిడిపి, జనసేన వైఖరిని స్పష్టం చేయాలి : రాంభూపాల్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాయలసీమ డిక్లరేషన్ పేరుతో నాటకాలాడిన బిజెపి రాయలసీమ ద్రోహిగా మిగిలిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్ పేర్కొన్నారు. కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు హామీ అమలు విషయంలో సెయిల్, నాణ్యత పేర్లతో కపటనాటకం ఆడుతోందన్నారు. కడప జిల్లా ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లోనూ ఎటువంటి కేటాయింపులూ చేయకుండా చోద్యం చూస్తోందని విమర్శించారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం టిడిపి మద్దతుతోనే కొనసాగుతోందని, ఇటువంటి సమయంలో టిడిపి, జనసేన పార్టీలు కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు హామీ పట్ల స్పష్టత రాబట్టుకోవాలన్నారు. ఇటీవల కేంద్రమంత్రి కుమారస్వామి కడప ఉక్కు ఫ్యాక్టరీ పరిశీలనలో లేదని చెబితే ఎటువంటి నిరసనా వ్యక్తం చేయని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు ఎవరికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని పరిస్థితులను ఆసరా చేసుకుని కేంద్రం ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గత ఎన్‌డియే ప్రభుత్వంతో అప్పట్లో టిడిపికి బంధం తెగగానే చెరో వైఖరితో సీమను మోసం చేశాయన్నారు. బిజెపి నాణ్యత, ఫీజుబిలిటీ పేరుతో, టిడిపి పార్లమెంట్ సభ్యులు సిఎం రమేష్‌ను నిరాహారదీక్షకు పురమాయించి నాటకాలు ఆడాయన్నారు. ప్రస్తుతం ఎంపి సిఎం రమేష్ బిజెపిలో ఉంటూ ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. వలసలు, రోడ్డుప్రమాదాలు, వ్యవసాయ కార్మికులు, కరువు కాటకాలతో దేశంలోనే వెనుకబడిన ప్రాంతమైన రాయలసీమలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడానికి 14 ఏళ్ల నుంచి కాలయాపన చేయడం తగదన్నారు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అంశంపై టిడిపి, జనసేన స్పష్టమైన వైఖరులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి ఒకటి, రెండు, మూడు తేదీల్లో నెల్లూరు జిల్లాలో నిర్వహించనున్న సిపిఎం రాష్ట్ర మహాసభలో కడప ఉక్కు ఉద్యమంపై స్పష్టత ఇస్తామని తెలిపారు. ప్రతిపక్ష స్థానంలో ఉన్న వైసిపి నిబద్ధతతో కూడిన రాజకీయాలు చేయాలన్నారు. కాంక్రీట్‌గా వ్యవహరించాల్సి ఉందని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి చంద్రశేఖర్, రామ్మోహన్, మనోహర్, అన్వేష్, కామనూరు శ్రీనివా సులరెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.



'కథానిక అంటే మళ్లీ మళ్లీ
చదివించే వచన ఖండకావ్యం.
వెనక నుంచి సముద్రం హోరు
వినిపిస్తూ చూడ్డానికి మాత్రం కెరటంలా
కన్పించేది'

- బుచ్చిబాబు



లిపిలేని కావ్యం

ఒక పూర్వపు అదును కోసం
వెతికి వెతికి
లోతుల్ని తడిమి తడిమి చూసిన ఆర్ద్రత
తీరా ఎదురు పడ్డాక ముడతలు పడ్డకాలం దర్శనమిస్తుంది
జ్ఞాపకాల అంచు మీద నిలబడి
వెనక్కి తొంగి చూస్తే
పూలను పాలవెన్నెల్ని ఏ తాంత్రిక శక్తో
కసిగా ఇరుకులోయల్లోకి విసిరేసినట్టు
గాయాల దేహం నలిగి ఉంటుంది
పాలబుగ్గల పసిడి మొగ్గను ఎవరో పాతేసినట్టు..
కక్షగా దింపిన గునపం ఒకటి ఏపుగా సమాధి మీద
పెరిగి ఉంటుంది
దేన్ని పోల్చుకోలేక
మరి దేన్ని గుండెలకు హత్తుకోలేక
ఒక సందేహం
ఒక సంశయం
ఎటు తేల్చుకోలేదు
కనుల చుట్టూ చలిమలు అయినా దాహం తీరదు
ముక్కలైన గుండె ఆకలిని పదే పదే చప్పరించినట్టు
ప్రేమోచ్ఛారణ చేస్తుంది
ఏ పురాణాల్లో లిఖించని కథని
పేదరాశి పెద్దమ్మ మూల మూలకు మేటలు వేస్తుంది
దశాబ్దాలుగా మూతపడ్డ ద్వారం తెరుచుకోదు
గర్భగుడిలో దీపం ఇంకా మిణుకు మిణుకుమంటూ
ఎవరికోసమో ఎదురుచూస్తుంది
చీకటి మాటున వెలుతురు
వెలుగు చాటున చీకటి ఎవరికి వినిపించని రహస్యాలు
మాట్లాడుకుంటాయి
గోడకు అంటిపెట్టుకొని ఉన్న కీటకం
కాలానికి సాక్షిగా నిలుస్తుంది
ఉదయ సాయంత్రాలు ఎదురుపడి వికర్షించుకున్న
శూన్యం యెల్లెడలా వ్యాపిస్తుంది
అగుపించని ముఖాల్లో భారమైన నిట్టూర్పుల వ్యథ
ఏ భావనలు వ్యక్తం కావు అర్థమూ కావు
నేపథ్యంలో అదృశ్యవాణి సంతాప సంగీతాన్ని నిశ్శబ్దంగా
ఆలపిస్తుంది
బాగా చీకటి పడ్డాక శిలల సమూహం మీదుగా దుఃఖపు
గీతం ఊరేగుతుంది నలుదిక్కులకు..
ఎవరూ చదవని
ఒక తాళపత్రగ్రంథం ఆమె
ఏ చరిత్ర లిఖించని అద్భుత ప్రేమగాథ అతను..

– లోసారి సుధాకర్, 99499 46991

గండికోట : The Great Canyon

ఈ ఆవరణలో అడుగుపెడితే
మీ కళ్ళు కైఫీయతులౌతాయి
చూపుల పుటల మీదుగా చరిత్రకోటలోకి
సరికొత్త సొరంగమార్గమేదో తెరుచుకుంటుంది
అలా పెన్నేటి నదీలోయలోకి తొంగిచూస్తే
వేలయేళ్ల స్వప్నాల అన్వేషణంతా
పోగుపోసినట్టుగా ప్రకృతి గీసుకున్న
ఆత్మచిత్రం..!

ఇది జలదుర్గమో వనదుర్గమో గిరిదుర్గమో
డ్రోన్ కళ్ళతో వెదికితే మీ అంతర్నేత్రం వెలుగుతుంది
కొండలోయ చెక్కిన ఎర్రటి గ్రానైట్ ప్రహారంలో
ఓ మహాద్భుత సౌందర్యం మీ మనసు మీద
ఉద్వేగపు సిరాతో 'ములికినాడు సీమ'
కావ్యాన్ని ముద్రిస్తుంది –

ఏ లక్షయేళ్ళనాడో ఈ కొండగుట్టల మీదుగా
కూసి పాటై జారిన నీటిరాగం
పరుగందుకున్న కొద్దీ పదును పెంచుకుందేమో!
లక్షల రాతి గుండెల్ని నిలువునా కోసీ
గుట్టల ఎముకల్ని గుట్టుగా గుజ్జులా కరిగించి
ఈ తీరు నదీకందకమై హొయలు పరచి
చాప్టర్లు చాప్టర్లుగా పూసగుచ్చే దృశ్యాలు..!

ఎన్నో తరాల కట్టుబానిసల చెమటముద్దలపై
తారీఖుల్లేని శాసనాల్లాంటి శాణపురాళ్ళు పేర్చి
ఉక్కు నిర్మాణంలా మలిచిన ఈ కోట దిగువన
ఇరుకులోయల సొగసు ఊయల్లో మైమరిచిపోతే
ఊహల రెక్కల మీద వెయ్యేళ్ళు వెనుకకు
విలంబ సంకేతాల వింత కాలాల్లోకి ముందుకు
ఒకేసారి వెళ్ళి రావొచ్చు –

ఇక్కడ ఎన్ని చావుల ఎండ కురిసిందో..
కత్తుల కోనేటిలో నెత్తురు కడిగిన నీళ్లు
యుద్ధాల గొంతు తడపడానికే చాల్లేదు!
ఈ ఎర్రమల కొండల కడుపున పుట్టిన
ఘటికులైన వీర పుత్రుల్ని స్మరిస్తూ
ఇప్పటికీ
గతం మరువని గాలులు రివ్వున తిరిగే
గస్తీనే సాక్ష్యం –

ఈ బారు బురుజుల మీద తచ్చాడే
తొమ్మిది శతాబ్దాల చరిత్రకు
అదృశ్య ఆకాశసేనల రెప్పమూయని పహారా..
సెంట్రీలై మీరూ జతకలుస్తారు –
రాతిచేతుల గొలుసుకట్టుగా గోడబండలన్నీ
కండపుష్టి గల సాయుధ సిపాయిల్లా
ఈ రాచవీటి శిథిలాలను కాపుగాయడం జూస్తే
మీరూ ఆ గోడల్ని ఆనుకుని స్థాణువౌతారు –

బుద్ధి వెలిగేదాకా ఇక్కడేవో రహస్యాలు గాలిస్తారు
గుండె లోతుల గండ్లు పూడ్చుకుంటారు
ఏ చీకటేళకో భారంగా మీరిక్కడినుండి కదిలెళ్ళినా..
మీ మనసును తోడ్కొని పోవడానికైనా
మళ్ళీ మీరిటు రావడం ఖాయం!

– కంచరాన భుజంగరావు
94415 89602

16న పుస్తకావిష్కరణ సభ

రచయిత సుసర్ల సర్వేశ్వర శాస్త్రి రచించిన నాటికలు ఇక్కడ ఉద్యోగాలు ఇవ్వబడును, కళాకారుడూ కళ్ళు తెరు, కాలేజీ ఎన్నికలు; అపరాధ పరిశోధన నవల 'అంతులేని వింత శిక్ష' పుస్తకాల ఆవిష్కరణ సభ విశాఖ రచయిత సంఘం ఆధ్వర్యంలో 16-12-2024 సోమవారం సాయంత్రం 5.30 గంటలకు విశాఖ పౌర గ్రంథాలయంలో జరుగుతుంది. మేడా మస్తాన్ రెడ్డి, కె. లతారాములు. అడపా రామకృష్ణ, ద్విభాష్యం రాజేశ్వరరావు, గాడేపల్లి సుందరరావు, డా. ఎస్.కృష్ణబాబు, శిరేల సన్యాసిరావు, సుసర్ల సర్వేశ్వరశాస్త్రి తదితరులు పాల్గొంటారు.

శాస్త్రీయ దృక్పథంతో సాహిత్య చరిత్ర రచన


సామాజిక శాస్త్ర పరిశోధనలో అంత్యంత ప్రాధాన్యం కల అంశం 'హిస్టోరియోగ్రఫీ'. 'చరిత్ర' అంటే గతాన్ని/ గడచిన కాలాన్ని శోధించటం, నమోదు చేయడం! హిస్టోరియోగ్రఫీ అంటే ఆ చరిత్రను, చరిత్రను ప్రేరేపించిన సామాజిక, మత, రాజకీయ పరిస్థితులను, వాటి ప్రభావాలను తర్కబద్ధంగా సైద్ధాంతికంగా అక్షరబద్ధం చేయటం. 'చరిత్రను అక్షరబద్ధం చేయటం ఎంత శ్రమతో కూడుకొన్నదో, దానిని తర్కబద్ధం చేస్తూ కాలావిష్కారం చేయటం మరీ కష్టం. నిజానికి ప్రతి భాషా చరిత్రకు ఒక 'హిస్టోరియోగ్రాఫర్' ఉండాలి. అలా తెలుగుకు కూడా కొంతమంది 20 శతాబ్దంలో ముందుకు వచ్చారు. వారిలో పెనుగొండ లక్ష్మి నారాయణ ఒకరు. అరసం ప్రస్తుత అఖిల భారత రచయితల సంఘం అధ్యక్షుడు అయిన పెనుగొండ గుంటూరు సీమ సాహిత్య చరిత్రను వెలుగులోకి తెచ్చిన పద్ధతి పరిశోధకులకు ఆసక్తికరమైనది.



తెలుగు సాహిత్య చరిత్రలో గుంటూరు సీమ సాహిత్య చరిత్ర ఒక విడదీయ రాని భాగం అని, తెలుగు సాహిత్య నిర్మాణానికి దోహదం చేసిందని భారతదేశంలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో అది వికసించిందని బోధపడుతుంది' అంటారు ప్రముఖ కథకుడు, సంపాదకుడు, విమర్శకుడు కేతు విశ్వనాథ రెడ్డి. 'విస్తృత పరిధిలో చరిత్ర దృక్పథాన్ని అవగాహన చేసుకోవడానికి, మానవ సమాజాలను సూక్ష్మ స్థాయిలో విశ్లేషించుకోవడానికి ఈ ప్రాంతీయ చరిత్రలు, వాటిలో భాగంగా స్థానిక చరిత్రలు తోడ్పడతాయి' అని విశ్లేషించారు ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త ఆచార్య వకుళా భరణం రామకృష్ణ.

ఇలాంటి సాహిత్య రచనల్లోని విషయాలు అనేక రీతుల్లో పరిశోధకులకు ఉపయోగపడతాయి. మొట్టమొదటి సంస్కృత రూపకం 'నరకాసుర విజయ వ్యాయోగం'కు తెలుగు అనువాదం చేసిన కొక్కొండ వెంకట రత్నం పంతులు గారు ఈ ప్రాంతం వారే. తొలి తెలుగు సాంఘిక నాటకం 'నందక రాజ్యం' రాసిన వావిలాల వసుదేవశాస్త్రి ఇక్కడి వాడే. తెలంగాణా సాయుధ పోరాటాన్ని మొదటిసారిగా చిత్రించిన 'మృత్యుంజయులు' నవలా రచయిత బొల్లిముంత శివరామకృష్ణ తెనాలి వాస్తవ్యుడే. ప్రాంతాలు వేరైనా తెలుగు జాతి ఒక్కటేనన్న భావనకు ఈ రచన సంకేతం. తొలి వీధి నాటిక 'వెట్టి చాకిరి' రచయిత తిరునగరి రామాంజనేయులు ఈ సీమ వారే. ఇవన్నీ ఒక్కచోట చేర్చటం సామాజిక పరిశోధకులకు భాషా, చరిత్ర అన్వయాలకు ఎంతగానో ప్రయోజనకరం.

పెనుగొండ లక్ష్మీ నారాయణ గుంటూరు జిల్లా చెర్వు కొమ్ముపాలెంలో కింది తరగతి రైతు కుటుంబంలో 1954లో జన్మించారు. న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించి... పలుపుల వెంకట శివయ్య, కొండేపూడి శ్రీనివాస రావు, పరుచూరి రాజారామ్ వంటి సాహితీ వేత్తల సాన్నిహిత్యంతో అభ్యుదయ రచనారంగం వైపు మళ్ళారు. 1973లో అరసం సభ్యత్వం స్వీకరించిన పెనుగొండ 2023 నాటికి ఆ సంఘం అధ్యక్షుడిగా ఎదిగారు. తొలి కవితా సంపుటి 'రేపటిలోకి' (2004), 'అనేక' (2004), 'విదిత' (2014), దీపిక (2021) వ్యాససంపుటాలు ఆయన సాహితీ ప్రజ్ఞను చాటి చెబుతాయి. వారి 'గుంటూరు సీమ సాహిత్య చరిత్ర' (2020) గుణాఢ్యుడి 'బృహత్ కథ మంజరి' వంటిది. గుంటూరు సీమ సాహిత్య చరిత్ర ప్రస్తుతం విశ్వవిద్యాలయాల్లో తెలుగు సాహిత్యం చదువుతున్న వారికి ఒక 'ఆకర' గ్రంథం. మోదుగుల రవికృష్ణ చెప్పినట్టు కట్టమంచి రామలింగా రెడ్డి గారు బతికుంటే ఈ బహత్ గ్రంథానికి పిహెచ్.డిగాని, డీ.లిట్‌గానీ ఇచ్చి ఉండేవారు.



గుంటూరు సీమ సాహిత్య చరిత్ర రాయటం ఎంత కష్టమో దానిని సమీక్షించటంగాని, విమర్శించటం గాని అంత కన్నా కష్టం. ఈ బృహత్ సంకలనంలో 'తెలుగు సాహిత్యం' అనే ఛత్రం కింద రాని విషయం, సాహితీ ప్రక్రియ లేవు. ఈ మొత్తాన్ని రచయిత మూడు భాగాలుగా విభజించారు. ఇందులో కొన్ని వ్యవస్థలుగా, కొన్ని వ్యక్తులకు చెందినవిగా ఆయన సులువుగా వర్గీకరించగలిగారు. తొలి భాగంలో జానపద సాహిత్యం, చాటుపద్య సాహిత్యం, రూపక సాహిత్యం, శాసన సాహిత్యం, శతక సాహిత్యం చేర్చారు.

ఇందులో 'శాసన సాహిత్యం' అనేది 'పరిశోధనా పరిణామం'లో వచ్చి చేరింది కాగా, మిగతా నాలుగు 'తమకు తాముగా' తామై ప్రజల గుండెలనుంచి, గొంతుకలనుంచి ఉద్భవించాయి. అవధానాలు, కైఫీయత్తులు, వచన కవితా వికాసం, కథానిక ప్రస్థానం అదనపు శీర్షికాకర్షణలు. పద్యారామం అనే శీర్షికలో తొలి తెలుగు ప్రజా కవి వేమన అంటూ ప్రారంభించి, జంట కవులు, కవిత్రయము, కొందరు పద్య కవులు లాంటివి చేర్చారు. సంగీత సాహిత్య స్రష్ట శ్రీ నారాయణ తీర్థయతీంద్రులు గురించి చాలా వివరంగా చెప్పుకొచ్చారు. వీటిలో ఒక్కొక్క అధ్యాయాన్ని మరికొంత పొడిగించి, సాహిత్య చరిత్ర పరిశోధనకు నిర్దేశిత మెథడాలజీ నేపథ్యంలో చర్చిస్తే, ఒక్కక్క దానికి ఒక డాక్టరేటు ఇవ్వవచ్చన్న మోదుగుల రవికష్ణ మాటలు అక్షరసత్యం.

ఏ సాహిత్య ప్రక్రియకైనా తొలినాడు గుంటూరు సీమలో ప్రాణం పోసినవారెవరో ఈ పుస్తకం ద్వారా తెలుసుకోవొచ్చు. రూపక సాహిత్యం తీసుకొంటే తొలి తెలుగు రూపకం 14వ శతాబ్ది నాటి వినుకొండ సీమకు చెందిన రావిపాటి త్రిపురాంతకుడు సంస్కృతంలో రచించిన 'ప్రేమాభిరామం' అనే వీధి రూపకం అనుసరించి వినుకొండ వల్లభామాత్యుడు రాసిన 'క్రీడాభిరామం' తెలుగులో తొలి రూపకం. పెనుగొండ వారికి దీని చుట్టూ అల్లుకొని ఉన్న వివాదం గురించి కూడా తెలుసునన్నట్టుంది. రెండవది కొక్కొండ వెంకటరత్న శర్మ రాసిన 'నరకాసుర విజయ వ్యాయోగం'. అలాగే మిన్నికంటి గురునాథ శర్మ, పోతరాజు విశ్వనాధకవి తొలి తరం 'గురువిశ్వనాథ' జంట కవులుగా ప్రశస్తి చెందారు. అయితే గుంటూరు సీమలో ప్రసిద్ధి చెందిన జంట కవులు 'కొప్పరపు కవులే' అన్నది నిర్ద్వంద్వం. వీరు అతి వేగంగా ఆశువుగా అవధాన పద్యాలు చెప్పేవారని చరిత్ర చెబుతోంది. కొప్పరపు కవులు ఆంగ్ల నాటకాలను అప్పటికప్పుడే తెలుగులో పద్యరూపంలో అవధానంలో చెప్పేవారని మిన్నికంటి గురునాథ శర్మ రాశారు. తొలినాటి బాల సాహిత్యానికి శ్రీకారం చుట్టిన వారు కరుణ శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి. వారు రాసిన 'తెలుగు బాల శతకం'. వారు రాసినదే 'కరుణామయి' బాలల నాటిక. ఇలా ఒక్క తొలి భాగంలోనే సుమారు వేయిమంది రచయితల ముఖ్య రచనలను ప్రస్తావించారు పెనుగొండ.

పుస్తకం

మలి భాగంలో ఉద్యమ సాహిత్య పోకడలను వివరిస్తూ, దళిత, బహుజన సాహిత్యం, హేతువాద సాహిత్యం, స్త్రీ వాద సాహిత్యం, రైతు సాహిత్యం గురించి విశదీకరించారు. ఈ సాహిత్యాన్ని ప్రజల్లోకి చేరవేయడంలో అరసం పాత్ర గురించి చర్చించారు. 'షేక్ నాజర్ తన ఆత్మ కథలో ప్రాచీన జాతి కళా వంశీయులైన సోది, యానాది, ఎరుకల, మాదిగ, చిందు, డక్కలి జాతుల వారిని పేర్కొనడం ద్వారా ప్రజాకళా సంస్కృతిని ఆయన గుర్తించిన వైనాన్ని పెనుగొండ చక్కగా వడిసిపట్టారు' అంటారు కేతు విశ్వనాథ రెడ్డి.

మూడవ భాగంలో '1932 నాటి 'కథావళి' సంకలన పరిచయం చేశారు. ప్రసిద్ధికెక్కిన 'నయాగరా' కవుల గురించి వివరించారు. 'దిగంబర' కవులకు పోటీగా గళం ఎత్తటం ఇందులో విశిష్టమైన అంశం. ఇందులో పులుపుల శివయ్య ప్రేరణే ప్రధానాంశంగా సిద్ధాంతీకరించారు. పెనుగొండ వారి సాహితీ వ్యవసాయం పరిణతి చెందినకొద్దీ విస్తృత రచనలు చేసే ప్రయాసలో భాగంగానే వచ్చినవే 'గుంటూరు సీమ సాహిత్య చరిత్ర', 'గుంటూరు కథలు'. అంతకుముందు కూడా వారు తమ సాహిత్య సాధికారత నిరూపించుకొనే ప్రయత్నంలో ఆణిముత్యాల్లాంటి సంపుటాలను వెలుగులోకి తెచ్చారు. వారి తొలి గ్రంథం 'అనేక' 2004లో ప్రచురితం కాగా, 'విదిత' 2014లో ప్రచురణయింది. 'దీపిక' 2021లో ప్రచురణ చేశారు. 'దీపిక'లో పూర్తి సాధికారిత కనిపిస్తుంది. 'దీపిక'లో చర్చించిన విషయాలపై వొరప్రసాద్ (సాహితీ స్రవంతి) ఇలా వ్యాఖ్యానించారు : 'తొలి మలి తరం తెలుగు కథలు' సంకలనం గురించి వివరంగా చర్చించి, తప్పులకు రుజువులు చూపిస్తూ, సరిచేసిన వ్యాసం విలువైన సమాచారం ఇస్తుంది. పివి నరసింహారావు రాసిన 'గొల్ల రామవ్వ' కథను చారిత్రకాంశాల నేపథ్యంలో విశ్లేషించారు. 'గురజాడ సాహిత్యం– వక్రీకరణలు – వాస్తవాలు' వ్యాసంలో గురజాడతో పాటు రాయప్రోలును యుగకర్త అనడంలోని 'సాహిత్య కుట్ర'ను బయట పెట్టారు. 'వైతాళికులు' సంకలనం వివాదంలో విస్మరణకు గురైన విలువైన కవితా సంకలనం 'కల్పన'ను పాఠకులకు పరిచయం చేశారు. ముఖ్యంగా సాహిత్య పరిశోధకులకు ఈ 'దీపిక' నిజంగానే కరదీపిక.


పెనుగొండ వారికి తెలుగు సాహిత్యానికి వారు చేసిన కషికి గాను అజో విభో కందాళ వారి 'జీవన సాఫల్య' పురస్కారం లభించింది. గతంలో అధికార భాషా సంఘం వారి తెలుగు భాషా పురస్కారం (2003)లో, ప్రజాకవి సుంకర సత్యనారాయణ స్మారక పురస్కారం (2003) వారి సాహిత్య కృషికి గుర్తింపుగా లభించాయి. 'సాహిత్య తైలంతో సదా వెలుగొందే చల్లని దీపం అతను. తన వరకే పరిమితం కాని పెద్ద చుట్టుకొలత గల జీవిత వృత్తాన్ని, వృత్తాంతాన్ని గీసుకొన్నాడు పెనుగొండ. ఆ వలయంలో అతని వెలుగు నీడల బాల్యం, కుటుంబం, బాంధవ్యం, స్నేహ సమూహం, పరిచయాల సమాజం ఇంకెన్నెన్నో ఉన్నాయి' అని ముక్తాయించారు కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత, ప్రముఖ కవి, కథకుడు పాపినేని శివశంకర్. 'స్థానిక చరిత్ర, సంస్కృతులు బృహత్ చరిత్రలో అంతర్భాగాలు. బృహత్ చరిత్ర నిర్మాణానికి ఇవి దోహదం చేసి, సుసంపన్నతను సమగ్రతను చేకూరుస్తాయి' అన్న వకుళాభరణం రామకృష్ణ వ్యాఖ్యలు పెనుగొండ లక్ష్మీనారాయణకి బాగా నప్పుతాయి. ఎందుకంటే ఒకరు సాహితీవేత్త అవటమే గాక, సాహితీ చరిత్రకారుడు కూడా అవటం చాలా విశేషం. ఈ రెండు లక్షణాలను కలబోసుకొని కళ్ళముందు నిలబడే నిండు ప్రశాంత రూపం పెనుగొండ లక్ష్మీనారాయణ.

(పెనుగొండ లక్ష్మీనారాయణ 2025 జనవరిలో అజో విభో కందాళ ఫౌండేషన్ వారి 'జీవన సాఫల్య ప్రతిభా మూర్తి పురస్కారం' అందుకోబోతున్నారు)

– డా. కొప్పరపు నారాయణ మూర్తి

సమ సమాజ కవి బోయి భీమన్న

ప్రకృతి మీద కవిత్వం రాసి ప్రావీణ్యాన్ని అలవరుచుకున్నవారు కొందరు. ఆధ్యాత్మికంగా కవిత్వం వ్రాసి భక్తి కవులుగా పేరెన్నికైనవారు కొందరు. ప్రేమ కవిత్వం వ్రాసి ప్రణయ కవులుగా పాఠకుల మదిలో నిలిచిన కవులు మరికొందరు.. ఇలా ఎందరో సాహితీ కవులుగా తమ కీర్తిని చాటుకునప్పటికీ సమాజం మారాలని, మూఢ నమ్మకాల నుండి కుల వివక్ష నుండి ప్రజలను ముఖ్యంగా గ్రామాల్లో నిరక్షరాస్యుల కోసం కవిత్వం, నాటకాలు, శతకాలు రచించిన వారు కొందరు.. ఆ కొందరిలో ఒకరు బోయి భీమన్న. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తూ పాలేరు నుండి పద్మ భూషణ్ వరకు ఎదిగిన సామాజిక కవి ఆయన. ఒక్క నాటకంతో ప్రజల మదిలో చెరగని ముద్రతో పాటు ఎన్నో కుటుంబాల్లో చైతన్యాన్ని తీసుకు వచ్చారు.



సందర్భం

1911 సెప్టెంబరు 19వ తేదీన కోనసీమలోని మామిడికుదురులో జన్మించారు ఆయన. అప్పట్లో గ్రామంలో చాలామంది బతకటానికి పాలేరు వృత్తికే అంకితం అయ్యేవారు. అలాంటి పరిస్థితుల్లో ఒకరోజు పిల్లలందరిని ఒక చోటికి చేర్చి చిన్న నాటకం వేయించారు. ఆ నాటకం తిలకించిన పెద్దలంతా ఆ తరవాత నుండి తమ పిల్లల్ని పాలేరు పనికి పంపలేదు. ఒక్క నాటకం ఎందరో జీవితాల్లో మార్పును తీసుకు వచ్చింది. ఆ నాటకం పేరే పాలేరు. అప్పటికే అంటరానితనం, అస్పృశ్యత పట్ల అంబేద్కర్, గాంధీ వంటి వారి బోధనలు భీమన్న గారిపై మెండుగా వుండటంతో నెమ్మదిగా సామాజిక మార్పుకు నడుం కట్టారు.

ఆయన రచన 'గుడిసెలు కాలిపోతున్నాయి' ఎంతో ప్రఖ్యాతి చెందింది. దానికి 1973లో సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. భీమన్న ఎన్నో పదవులు నిర్వహించి, వాటికి వన్నె తెచ్చారు. అనేక కవితా సంపుటాలు, నాటకాలు రాశారు. అన్నిటిలోనూ సామాజిక మార్పే కీలకంగా ప్రతిపాదించారు. మార్పు అనేది ప్రయత్నపూర్వకంగా సాధ్యమవుతుందని చెబుతారు. సామాజిక అసమానతలను; కుల, మత, లింగ, వర్ణ వివక్షలను ఆయన నిరసించారు. వాటిని ఇతివృత్తాలుగా మలిచి తన నాటకాల్లో దృశ్యమానం చేసారు. పాలేరు, కూలిరాజు, అసూయ, ప్రగతి, రాగ వాశిష్ఠం వంటి ఎన్నో నాటకాలు రచించారు. 'భీమన్న నిజమైన కవి. ఆర్తి ఆయన కవిత్వానికి ప్రాణం. వ్యంగ్యం జీవకళ' అని వర్ణించారు ఎన్ గోపి. మన సమాజంలో అసమానతలు పోయేంతవరకూ ఆయన రచనలు పోరాడమని ప్రేరేపిస్తాయని చెప్పారు

నేను సూర్యుణ్ణి కాను; చంద్రుణ్ణి
నాకున్నది ఎండకాదు... గుండె
నేను కోరేది మీ దయా ధర్మ భిక్ష కాదు; నాకు రావలసిన బాకీ" భీమన్న అనటంలో ఒక సామాజిక స్పష్టత వ్యక్తమవుతుంది. అధికారం కోసం వలలు పన్నే నాయకుల పట్ల జాగ్రత్త అవసరమని బోయి భీమన్న బోధించారు. ఓటర్ల మనస్తత్వంపై

భీమన్న విసిరిన వ్యాఖ్యానాలు ఎన్నో!
బలం కలవాడు పులి
తెలివి కలవాడు నక్క
ఈ ఇరువర్గాలకూ ఆహారంగా
బతుకుతున్న వర్గాలు గొర్రెలు" అంటూ ఎన్నో ములుకుల్లాంటి మాటలు విసిరారు. నవ సమాజం కోసం తన కలాన్ని కదిలించిన మహోన్నతుడు ఆయన. 94 ఏళ్ల వయసులో 2005 డిసెంబరు 16వ తేదీన కన్నుమూశారు. ఆయన కుమార్తె విజయభారతి కూడా విద్యావేత్తగా, రచయిత్రికి ఎన్నో అభ్యుదయ రచనలను వెలువరించారు. అంతరాలను పెంచే పాలకుల పన్నాగాలను అర్థం చేసుకొని, వాటిని తుత్తనియలు చేస్తూ ముందుకు పోవటమే బోయి భీమన్నకు నివాళి.

(డిసెంబర్ 16 : బోయి భీమన్న వర్థంతి.)

– ఎం.లక్ష్మి

మా అబ్బాయి అమెరికా నుంచి వస్తున్నాడు

వొస్తాడనీ
వొస్తూ వొస్తూ ఓ చిరునవ్వు ముక్కని
ఫారిన్ చొక్కా జేబులో
ప్రేమగా దాచుకొస్తాడనీ
పోస్ట్‌మెన్ కనిపించిన ప్రతిసారీ
పొద్దు పొడుపు చుక్క లాంటి ఆశ.

నా కోసం లంకె బిందెలూ
ఏనుగు దంతం పిడివున్న చేతికర్రా
కొలెస్ట్రాల్‌కి కొత్తగా కనిపెట్టిన మందూ
ఓ ఫ్రెంచి మద్యం బాటిలూ
ఎప్పుడూ యేవీ కోరలేదు
కోరిందల్లా నా గుండెల్లో
వాడి అడుగుల చప్పుడు వినబడాలని
నా చిట్ట చివరి శ్వాసైనా
వాడందుకోవాలని
వాడు నాకు పిండం పెట్టినా
పెట్టక పోయినా
గొయ్యిలో నన్ను పండబెట్టినప్పుడు
ఓ గుప్పెడు మట్టి ముద్దపైన
వాడి చేతి స్పర్శ వెచ్చదనం తొకాలని.

కొడుకుని
కోరికలు తీర్చడానికే కన్నావా?
మోకాళ్లు వొణుకుతున్నప్పుడు
వాడు కీళ్ల ముద్దైతే చాలు
మాట పడిపోయినప్పుడు
అన్నం ముద్ద చెయ్యైతే చాలు
నా పాడె మోయటానికి
వాడొక భుజమే
మిగతా మూడు భుజాలూ
నన్ను బతికించిన నమ్మకాలే!

అందుకే వాడి కోసం
అందరాని నిరీక్షణ
జనంలో వొంటరితనంలో
వాడి జ్ఞాపకాల పర్యవేక్షణ.

ఈ నేల వాడిది
ఈ దేశం వాడిది
ఇక్కడి పంచభూతాలు వాడి ఆస్తి
సముద్ర తీర రేఖలు
దాటి వెళ్ళాడే కానీ
వాడి నీడ
ఇక్కడే మర్చిపోయాడు
అందుకే వెలుతుర్లో వాడి స్పర్శ

వాడెప్పుడూ
నాకు దూరంగా లేడు
వాడి మూడు చక్రాల కర్ర బండి
గాడి విరిగిన కుంటి సైకిలు
వాడి క్రికెట్ బంతి
టంగుస్ తెగిన బ్యాటు
రోజు మాట్లాడుతూనే ఉంటాయి
వాడి పాత చెప్పులు
చిలిపి గా గెంతడం తెలుసు
ట్రంకు పెట్టెలోని పాత చొక్కా
యిల్లంతా అల్లరి చేయడం తెలుసు
జామ చెట్టు మీద వాలే చిలకులు
వాడి పేరే స్మరిస్తాయి
రాత్రింబవళ్ళూ
నా చుట్టూ వాడే
నన్ను చుట్టుకొనీ వాడే

నా కంటి కెమెరాలో వాడు
ఫొటోగా అతుక్కుపోయాడు
గుండె గోడ ఖాళీగా వుండిపోతుందనీ
ఫ్రేముగా వేలాడుతున్నాడు
నా గుండె పెండ్యూలమ్
.కదలిక కూడ వాడే
వాణ్ణే అడగండి
ఈ నేల మీద వాడి పాదముద్రలు
వున్నాయో లేదో
గాలిలో వాడి వూపిరి తెరలు
కదలాడుతున్నాయో లేదో
వాడెక్కడి కెళ్తేనేం
ఎన్ని దూరాలు దాటితేనేం
గాలి వీచినప్పుడల్లా
ఎండుటాకులు అల్లాడినట్టు
వూపిరి పీలుస్తున్నప్పుడల్లా
వాడి పేరే తలుస్తుంటానెందుకో
వాడునా యవ్వనంలోని గెలుపు
వాడు నా రక్తంలోని ఎరుపు
వాడు లేకుండా నా వొంటరి పేగు
ఎప్పుడూ ముడి పడదు .
వాడు వొస్తున్నాడు.
అమెరికా నుంచి వొస్తున్నాడు.

– ఈతకోట సుబ్బారావు
9440529785

జన'జాతర'



దేవుడు ఎప్పుడూ అక్కడే
ఉంటాడు
జాతరలో ఇప్పుడు జనాలు
ఎందుకో ఎగబడుతున్నారు
బహుశా జనం
ఎక్కువైనందుకు
ఇంకాస్త విలువ
పెంచుకుంటాడేమో!

పొడుగాటి వరుసలు
ఉక్కిరిబిక్కిరి చేస్తున్నా
ఊపిరి బిగబట్టుకొని
దేవుడు కనబడేదాకా
వెతుకుతాం
క్షణాల్లో కళ్ళు మూసుకొని
గుండెలో నింపుకుంటాం!

కాసింత ప్రశాంతతను
మది నిండా నింపుకొని
కోరికలను హుండీలో వేసి
భారాన్ని దించేసుకొని
ఖాళీగా వెనుదిరుగుతాం!

మెట్టు మెట్టుకో రెండు చేతులు
దీనంగా మొలుస్తాయి
దేవుణ్ణి దర్శించుకొని వస్తున్న
కళ్ళలో
మరో దేవుణ్ణి చూస్తూ
బతుకునివ్వమని
వేడుకుంటాయి
ఎముకలేని చేతులు కొన్ని
దానగుణాన్ని చూపిస్తాయి
చూడీ చూడని కొన్ని కళ్ళు
తప్పించుకుని పరుగులు
తీస్తాయి!

దేవుడున్నాడో లేడో కానీ
ఒంటరితనం శాపం కాదని,
అందరికీ తానున్నానని
జనసముద్రంలో
ముంచెత్తుతాడు!

జాతర
మనసును రంగులరాట్నం
చేస్తుంది
జాతర
మనుషులను ఒక దగ్గరికి
చేరుస్తుంది!

– పుట్టి గిరిధర్
94949 62080

17న ఏకలవ్య కాలనీ కథలు ఆవిష్కరణ

పర్ స్పెక్టివ్స్ ప్రచురించిన పలమనేరు బాలాజీ ఎరుకల జీవన గాథలు, తెలుగు సాహిత్యంలో మొదటి ఎరుకల కథా సంపుటి 'ఏకలవ్య కాలనీ' పుస్తక ఆవిష్కరణ 17.12.2024 మంగళవారం సాయంత్రం 4 గంటలకు హైదరాబాదులోని ఎజి ఆఫీసుకు ఎదురుగా ఉన్న స్కైబాబా సాథి బుక్ స్టాల్‌లో జరుగుతుంది. వెయిట్ లిఫ్టింగ్ స్వర్ణపతకాల విజేత రాగాల వెంకట రాహుల్ పుస్తకాన్ని ఆవిష్కరించి, తొలి ప్రతిని కవి కె.శివారెడ్డికి అందజేస్తారు. సాహిత్య విమర్శకుడు, వీక్షణం పత్రికా సంపాదకుడు ఎన్.వేణుగోపాల్, ఎ.కె.ప్రభాకర్, వాడ్రేవు చిన వీరభద్రుడు, యాకూబ్, శిలాలోలిత, యింద్రవెల్లి రమేష్, సుంకోజి దేవేంద్రాచారి, విమల, మెర్సీ మార్గరెట్, స్కై బాబా, గీతాంజలి, తాయమ్మ కరుణ, కృపాకర్ మాదిగ, జూపాక సుభద్ర, శివరాత్రి సుధాకర్, గుడిపాటి, ఎం.వి.రామిరెడ్డి, ఛాయ మోహన్, కె.ఎ.ముని సురేష్ పిళ్లై, జి.ఉమామహేశ్వర్, తదితరులు పాల్గొంటారు.

– పలమనేరు రచయితల సంఘం
94409 95010

22న 'నక్షత్ర బాట' ఆవిష్కరణ సభ

ప్రముఖ కథా నవలా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి పూర్వ సభ్యులు అట్టాడ అప్పలనాయుడు నవల 'నక్షత్ర బాట' ఆవిష్కరణ సభ డిసెంబర్ 22, 2024 ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం వరం రెసిడెన్సీలో జరుగుతుంది. గంటేడ గౌరునాయుడు అధ్యక్షత వహిస్తారు. ఆంధ్రా యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు ప్రొ.నిర్మల నవలను ఆవిష్కరిస్తారు. మాతృక మాసపత్రిక సంపాదకులు బత్తుల రమాసుందరి నవలా పరిచయం చేస్తారు. అమరులు పంచాది నిర్మల, తామాడ పోలమ్మ, పైలా చంద్రమ్మల కుమార్తెలు పంచాది రోజా, తామాడ అరుణ, అత్తలూరి అరుణ ప్రియ అతిథులుగా పాల్గొంటారు. ఉత్తరాంధ్ర ప్రముఖ సాహిత్య సంస్థల బాధ్యులు పాల్గొంటారు. సాహితీ స్రవంతి, శ్రీకాకుళ సాహితి సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి.

21న శీలావి చేతిరాత ఫాంట్ ఆవిష్కరణ

డిసెంబరు 21, (శనివారం) హైదరాబాద్, రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్లో సాయంత్రం 5.30 గంలకు శీలా వీర్రాజు గారి చేతిరాతతో రూపొందిన తెలుగు ఫాంట్ లాంచింగ్, శీలా సుభద్రాదేవి గారి 'మాట్లాడటానికో మనిషి కావాలి' కవితా సంపుటి ఆవిష్కరణ ఉంటాయి. నందిని సిధారెడ్డి, సుధామ, డా.అమృతలత, పుప్పాల శ్రీరామ్, శీలా సుభద్రాదేవి పాల్గొంటారు

– శీలా సుభద్రాదేవి, శీలావీ సాహిత్య చిత్రకళావేదిక

22న ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డుల సభ

డిసెంబర్ 22, ఆదివారం ఉదయం 10 గంటలకు అనంతపురంలోని ఎన్‌జీఓ హొంలో ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుంది. ముఖ్య అతిథిగా ప్రముఖ సాహితీ వేత్త వాడ్రేవు చినవీరభద్రుడు పాల్గొంటారు. ఉమ్మడిశెట్టి అవార్డును డా.బండి సత్యనారాయణ; ఉమ్మడిశెట్టి సతీష్ కుమార్ జాతీయ యువ పురస్కారం –కవయిత్రి మానస చామర్తి స్వీకరిస్తారు. రాధేయ కవిత్వం 'అజేయుడు' ఆవిష్కరణ జరుగుతుంది.

– డా.ఉమ్మడిశెట్టి రాధేయ
అవార్డు వ్యవస్థాపకులు,అనంతపురం

అంగన్‌వాడీలపై మోయలేని పని భారం !

- 'గౌరవ' వేతనం పేరుతో శ్రమ దోపిడీ
- ఇచ్చేది గోరంత...చాకిరీ కొండంత
- ఎప్పుడు ఏ పని పురమాయిస్తారోనని ఆందోళన



సమస్యలపై ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

న్యూఢిల్లీ : ప్రాథమిక విద్యాభ్యాసానికి ముందు అంటే ఒకటవ తరగతిలో చేరడానికి ముందే చిన్నారుల సంరక్షణ, విద్య (ఈసీసీఈ)పై జాతీయ విద్యా విధానం-2020 దృష్టి సారించింది. ఈ విధానాన్ని గతంలో ఎన్నడూ అనుసరించలేదు. చిన్నారుల వయసు ఆరు సంవత్సరాలకు చేరకముందే వారి మెదడు 85 శాతం మేర వృద్ధి చెందుతుంది. ఓ చిన్నారి ఆలోచనలు, మేధస్సు, భావోద్వేగ వృద్ధికి ఆ వయసు అత్యంత కీలకమైనదని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే ప్రీ-ప్రైమరీ తరగతులను (గ్రేడ్-1కి ముందు) ప్రభుత్వ పరిధిలో చేర్చారు. పాఠశాల విద్యను పూర్తిగా ప్రక్షాళన చేయడానికి వీలుగా తరగతులను నాలుగు స్థాయిలుగా విభజించాలని నేషనల్ కరికులమ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌సీఎఫ్) సూచించింది. అందుకోసం 5+3+3+4 ఫార్ములాను రూపొందించింది.

ఆటలతో విద్య

ఇందులో మొదటి ఐదు సంవత్సరాలను ఫౌండేషన్ దశ అంటారు. ఈ దశలో మూడు నుండి ఎనిమిది సంవత్సరాల వయసున్న చిన్నారులు ఉంటారు. సమీప భవిష్యత్తులో ప్రామాణికీకరణకు, ప్రైవేటు ప్రీ-స్కూల్స్ క్రమబద్ధీకరణకు కూడా ఇది బాటలు వేస్తుంది. ఈ దశలో అంగన్‌వాడీలను, ప్రాథమిక పాఠశాలలను భాగస్వాములను చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఆటలతో కూడిన విద్యను నేర్పడం ఈ దశ ప్రత్యేకత. అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ విషయంలో ఎక్కువ బాధ్యత అప్పగిస్తారు. అందుకోసం అంగన్‌వాడీ కార్యకర్తలకు అవసరమైన శిక్షణ అందిస్తారు. ఆ దిశగా ప్రభుత్వం పలు చర్యలను ప్రకటించింది.

విధులేమిటి?

ప్రస్తుతం ఆరు సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరవుతున్నారు. 2023 డిసెంబర్ 31 నాటికి దేశంలో 3,48,135 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 12,23,068 మంది సహాయకులు ఉన్నారని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. గర్భిణులు, పాలిచ్చే తల్లులు, శిశువులు, ఆరు సంవత్సరాల లోపు వయసున్న పిల్లల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరోగ్య సంబంధమైన పథకాలకు సంబంధించిన వివిధ పోషకాహార, అవగాహనా కార్యక్రమాల అమలును వీరందరూ నిశితంగా పర్యవేక్షిస్తూ అమలు చేస్తారు. ఇప్పుడు కొత్తగా ప్రీ స్కూల్ విద్యకు సంబంధించిన బాధ్యతను కూడా వీరి పైనే మోపబోతున్నారు.

శిక్షణ కాదు...శిక్షే

ఫౌండేషన్ స్థాయిలో జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసే విషయంలో వివిధ రాష్ట్రాలు వేర్వేరు వైఖరులను అనుసరిస్తున్నాయి. ప్రీ స్కూల్ స్థాయిలో ఆటలతో విద్యను అందించడంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు దీర్ఘకాల శిక్షణ ఇవ్వాలని యోచిస్తున్నారు. మహారాష్ట్రలో ఇప్పటికే ఆరు నెలల కోర్సును రూపొందించారు. అంతేకాదు... అంగన్‌వాడీలకు శిక్షణ అందించే వారికి అవసరమైన సూచనలు కూడా ఇచ్చారు. ఇంటర్ వరకూ విద్యను అభ్యసించిన వారికి ఆరు నెలలు, అంతకంటే తక్కువ విద్య ఉన్న వారికి సంవత్సరం శిక్షణ ఇస్తారు. ఇప్పటికే బండెడు చాకిరీతో తల్లడిల్లుతున్న అంగన్‌వాడీలకు ఇది ఓ రకంగా శిక్ష వంటిదే.

ఇదో రకం శ్రమ దోపిడీ

అంగన్‌వాడీలపై ఇప్పటికే అధిక పనిభారం పడుతోంది. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ 3-6 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలను చూసుకుంటారు. ఆ తర్వాత వారికి భోజనం పెట్టాల్సి ఉంటుంది. రెండు గంటలకు ఈ పనులు పూర్తి చేసుకొని ఆ తర్వాత మహిళలు, శిశువుల బాగోగులు చూస్తారు. అన్ని రకాల సమాచారాన్ని సిద్ధంగా ఉంచడం, ఇతర పథకాలకు సంబంధించిన చిన్నా చితకా పనులు చేయడం, ప్రభుత్వం అప్పగించే కార్యక్రమాలు నిర్వహించడం...వీటన్నింటితో అంగన్‌వాడీలకు తగినంత విశ్రాంతి అనేదే లేకుండా పోతోంది. పనికి తగిన వేతనం అనే మాట వీరి నిఘంటువులోనే లేదు. వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించరు. కనీసం గ్రాట్యుటీ, పెన్షన వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలు కూడా కల్పించరు. జీతానికి బదులు గౌరవ వేతనం అందిస్తూ శ్రమను దోచుకుంటారు. ఆ ఇచ్చేది కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచుకుంటాయి.

పని భారం పెంచిన డిజిటలీకరణ

కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ప్రధాన అంగన్‌వాడీలలో పనిచేసే కార్యకర్తలు, సహాయకుల నెలసరి గౌరవ వేతనాన్ని రూ.4,500, 2,250కి పెంచింది. రాష్ట్రాలు అందించే మొత్తంలో వ్యత్యాసాలు ఉన్నాయి. తమిళనాడులో కార్యకర్తలు రూ.13,452 పొందుతుంటే పశ్చిమ బెంగాల్‌లో రూ.8,250 మాత్రమే ఇస్తున్నారు. డిజిటలీకరణ నేపథ్యంలో పనిభారం పెరిగిందే తప్ప తగ్గలేదు. అంగన్‌వాడీలు మొబైల్ అప్లికేషన్-పోషణ్ ట్రాకర్ యాప్‌లో పూర్తి సమాచారాన్ని అప్‌లోడ్ చేయాల్సి రావడంతో పెద్ద ఎత్తున గందరగోళం, అసమ్మతి చోటుచేసుకుంటున్నాయి. పనిభారం అసాధారణంగా పెరిగిపోతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెట్‌వర్క్ సరిగా లేదని, ఫోన్లు కూడా నాసిరకంగా ఉన్నాయని వారు ఫిర్యాదు చేస్తున్నారు. ఫోన్ పనిచేయకపోతే వదిలేయడానికి లేదు. ఎవరైనా మహిళను ఓ పథకంలో నమోదు చేయాలంటే ముందుగా ఆమె కేవైసీని పూర్తి చేయాలి. అయితే ఆ మహిళకు ఫోన్ ఉండదు. భర్త వద్ద ఉన్నప్పటికీ పనిలో ఉంటాడు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అర్థం చేసుకోలేని వారు అసహనానికి గురవుతుంటారు.

రాత్రి సమయంలో కూడా...

గత సంవత్సరం డిసెంబరులో ఇరవై వేల మంది అంగన్‌వాడీలు ముంబయిలోని ఆజాద్ మైదాన్‌లో 52 రోజుల పాటు నిరసన తెలిపారు. ఆ కాలంలో వారికి వేతనాలు ఇవ్వలేదు. అంతేకాక క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. ఈ సంవత్సరం జూలైలో పంజాబ్ నుండి తమిళనాడు, ఢిల్లీ, మహారాష్ట్ర వరకూ పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. గత ఏడాది మేలో కేంద్రం 'పోషణ్ భీ, పఢాయ్ భీ' పేరిట ఓ కార్యక్రమాన్ని చేపట్టింది. దీని బాధ్యత కూడా అంగన్‌వాడీల పైనే పడింది. పోషకాహారానికి సంబంధించిన కోణంపై వారు మరింతగా దృష్టి సారించాల్సి వచ్చింది. చేయాల్సిన పని చాలా వరకూ ఆన్‌లైన్‌లోనే జరుగుతుండడంతో తరచుగా రాత్రి 11 గంటల వరకూ విధులు నిర్వర్తించాల్సి వస్తోందని అంగన్‌వాడీలు చెప్పారు. బోధనా విధానంలో తరచూ మార్పులు చేస్తున్నారు. కానీ అంగన్‌వాడీలకు అవసరమైన మౌలిక సదుపాయాల మద్దతు అందించడం లేదు. మరింత క్రియాశీలకంగా పని చేయాలంటే మంచి వేతనాన్ని ఇవ్వాలని, ప్రయోజనాలు కల్పించాలని వారు కోరుకుంటున్నారు. ఇది అత్యాస కాదేమో.



మహాసభ ప్రతినిధులతో బృందాకరత్, అమ్రారాం, విజుకృష్ణన్

ప్రజల జీవనోపాధులపై కేంద్రం దాడి

- ప్రతిఘటనతోనే సమస్యలకు పరిష్కారం
- సిపిఎం రాజస్థాన్ మహాసభలో బృందాకరత్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ ప్రజల జీవనోపాధులపై అనునిత్యం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దాడి చేస్తోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ విమర్శించారు. సిపిఎం రాజస్థాన్ రాష్ట్ర 24వ మహాసభలో ఆమె ప్రసంగించారు. హనుమాన్‌నగర్‌లో సీతారాం ఏచూరి నగర్, బ్రిజ్‌లాల్ బదు మంచ్, బిజ్లా సింగ్ ఆడిటోరియంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ మహాసభలో ఆమె మాట్లాడుతూ.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో నేర్చుకున్న గుణపాఠాలను విస్మరించి, ఆర్‌ఎస్‌ఎస్ విభజన రాజకీయాలను ముందుకు తీసుకెళ్లడంపైనే బిజెపి దృష్టి నిలిపిందని విమర్శించారు. ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం -1991కి విరుద్ధంగా దేశవ్యాప్తంగా అనేక చోట్ల ముస్లింలు, ఇతర మైనార్టీలకు చెందిన ప్రార్థనా స్థలాల ప్రాంగణాల్లో హిందూ ఆలయాల ఆనవాళ్లు ఉన్నాయన్న ప్రచారంతో సంఘ్ పరివార్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని, మత వైషమ్యాలను రెచ్చగొడుతోందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో సహా రాజ్యాంగ పదవుల్లో ఉన్న బిజెపి నేతలు, దానితో అనుబంధమున్న అనేక మంది ప్రజలను విభజన రాజకీయాల చట్రంలో బంధించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. రాజ్యాంగంపై నీతులు వల్లె వేస్తున్న ప్రధాని మోడీకి కార్చిచ్చులా హింసాకాండతో రగులిపోతున్న మణిపూర్‌ను సందర్శించే తీరిక లేకపోవడం సిగ్గుచేటు అని బృందాకరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సహజ వనరులను, జాతి సంపదను బడా కార్పొరేట్ మిత్రులకు కట్టబెట్టి..దేశాన్ని మాంద్యం దిశగా దేశాన్ని నెట్టేస్తున్నారని తప్పుబట్టారు. వినాశకరమైన కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే ప్రజలు సమస్యల వలయంలో చిక్కుకున్నారని, వీటి పరిష్కారం కోసం విశాల ప్రతిఘటనా పోరాటాలే మార్గమని ఆమె పిలుపునిచ్చారు. మహాసభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు విజు కృష్ణన్ కూడా ప్రసంగించారు.

కార్యదర్శిగా కిషన్ పరీక్ ఎన్నిక

మూడు రోజుల పాటు జరిగిన మహాసభలో 35 మందితో రాష్ట్ర కమిటీ ఎన్నికైంది. రాష్ట్ర నూతన కార్యదర్శిగా కిషన్ పరీక్ ఎన్నికయ్యారు. ప్రస్తుత రాష్ట్ర కార్యదర్శి ఆమ్రారామ్ రిలీవ్ అయ్యారు.

సమాఖ్య వ్యవస్థకు 'జమిలి' విఘాతం

- జమ్ముకాశ్మీర్ నేతలు మెహబూబా, తరిగామి, మసూది

న్యూఢిల్లీ : దేశంలో లోక్‌సభ, అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలను నిర్వహించే విషయంలో కేంద్రం ముందుకెళ్తున్నది. దీనిపై లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టటానికి సిద్ధమైంది. మోడీ సర్కారు చర్యపై ఇప్పటికే ప్రతిపక్షాల నుంచి వ్యతిరేకత వచ్చింది. జమ్మూకాశ్మీర్‌లోని నేతలు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. 'వన్ నేషన్, వన్ పార్టీ' జమిలీ లక్ష్యమని వారు ఆరోపిస్తున్నారు. బిజెపి భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నదని జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ (పిడిపి) అధినేత్రి మెహబూబా ముఫ్తీ ఆరోపించారు. "భారత్ ఒక సమాఖ్య దేశం. శ్రీనగర్‌లో సమాఖ్య నిర్మాణం ఉన్నది. 'వన్ నేషన్, వన్ ఎలక్షన్' అనేది సమాఖ్య నిర్మాణాన్ని దెబ్బతీస్తుంది. వారు (బిజెపి) మనల్ని నియంతృత్వం వైపు తీసుకెళ్లాలని చూస్తున్నారు" అని పార్టీ కార్యక్రమంలో ఆమె అన్నారు.

సిపిఎం నేత, జమ్మూకాశ్మీర్ శాసనసభ సభ్యులు ఎంవై తరిగామి కూడా జమిలీ ఎన్నికల ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించారు. "ఇది భారత ఆలోచన, దాని సమాఖ్య నిర్మాణానికి విరుద్ధం. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా లేవనెత్తే అంశాలు పూర్తిగా వేరు. ఈ ప్రతిపాదన ఫెడరల్, ప్రజాస్వామ్య వ్యవస్థ బీటలు వారటానికి కారణమవుతుంది. నియంతృత్వాన్ని బలోపేతం చేస్తుంది" అని ఆయన అన్నారు.

దేశంలో ఏకపార్టీ వ్యవస్థకు మార్గం సుగమం చేసే చర్యగా ఈ ప్రతిపాదన కనిపిస్తున్నదని నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు, మాజీ ఎంపీ హస్నైన్ మసూదీ తెలిపారు. "భారత్ ఒక యూనియన్ ఆఫ్ స్టేట్స్ అన్నది రాజ్యాంగం స్పష్టం చేస్తున్నది. 'వన్ నేషన్, వన్ ఎలక్షన్' ప్రతిపాదన ఫెడరల్ నిర్మాణానికి వ్యతిరేకం, రాజ్యాంగానికి విరుద్ధం" అని మసూదీ అన్నారు.

భారతీయులను కలిపి ఉంచేది రాజ్యాంగమే

(మొదటి పేజీ తరువాయి)

కోరుకున్నారన్నారు. ఆయన అస్థిత్వం విశ్వమానవ లక్షణంతో ఉందని గుర్తు చేశారు. మన అస్థిత్వం భారతీయతని చెప్పారు. భారతీయులందరికీ సమానమైన హక్కులుండాలన్నారు. రాజ్యాంగంపై పార్లమెంటులో చర్చ జరుగుతున్న నేపథ్యంలో బిజెపి, కాంగ్రెస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడితే, బిజెపి రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నదని చెప్పారు. ప్రపంచంలో ఎలక్టోరల్ డిక్టేటర్‌షిప్ అనే కొత్త సంస్కృతి తెరపైకి వచ్చిందనీ, అది సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధమని తెలిపారు. ఒకే దేశం-ఒకే ఎన్నిక కూడా నియంతృత్వానికి దారి తీస్తుందని చెప్పారు. రాజ్యాంగ లక్ష్యాలైన ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమాఖ్య వాదం, సామాజిక న్యాయం, సార్వభౌమత్వం కాపాడటమే తక్షణ కర్తవ్యమన్నారు. మతం వ్యక్తిగతమనీ, దానిలో రాజ్యం జోక్యం ఉండకూడదన్నారు. పెట్టుబడిదారీ సమాజంలో అసమానతలు పెరిగాయనీ, ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థపట్ల వ్యతిరేకత పెరుగుతున్నదని, సామ్యవాద భావనకు మద్దతు పెరుగుతుందని తెలిపారు. తొలుత దత్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్, సిఐటియు ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య, యూటీఎఫ్ సీనియర్ నాయకులు పి మాణిక్ రెడ్డి, ఎం నరహరి, సి కమల కుమారి, రాష్ట్ర నాయకులు సింహాచలం, కొండలరావు, పౌరస్పందన వేదిక కార్యదర్శి రాథేశ్యామ్, దత్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ స్కూల్ గేమ్స్‌లో రాష్ట్ర విద్యార్థుల సత్తా

(మొదటి పేజీ తరువాయి)

పల్నాడు జిల్లా మాచవరంలోని మండల పరిషత్ పాఠశాలకు చెందిన పొట్టిమూర్తి రోషన్, అనంతపురం జిల్లా పోలకుంట్ల లోటస్ ఉన్నత పాఠశాలకు చెందిన డివి యజ్ఞనాథ్, నంద్యాల జిల్లా ఐకాన్ స్కూల్‌కు చెందిన వై అఖిల్ ప్రకాష్, సత్యసాయి జిల్లా కదిరికి చెందిన నారాయణ స్కూల్‌కు చెందిన కాటం ఈశ్వర్ రజత పతకాలు సాధించారు. బ్యాడ్మింటన్ అండర్-14 బాలికల విభాగంలో అనంతపురం లోటస్ స్కూల్‌కు చెందిన డివి యజ్ఞశ్రీ, విజయవాడలోని యట్కిన్‌సన్ స్కూల్‌కు చెందిన ఇత్తంశెట్టి తన్వి, కాపవరం వియాన్ స్కూల్‌కు చెందిన నాగిరెడ్డి సాహితీ, విజయవాడ కెకెఆర్ గౌతమ్ స్కూల్‌కు చెందిన శ్రీరామ్ కావ్య, నెల్లూరు లిల్లీ లిటిల్ ఫ్లవర్ స్కూల్‌కు చెందిన గూడూరు సుష్మారెడ్డి, అల్లూరి సీతారామరాజు జిల్లా కెజిబివి పాఠశాలకు చెందిన గుత్తుల మధు చందన రజత పతకాలు సాధించారు. వెయిట్ లిఫ్టింగ్ అండర్-17 బాలికల విభాగంలో విశాఖపట్నం ఎస్‌విపిపి రాజా విద్యాపీఠంకు చెందిన సిరిపురపు మిహీరా 57-60 కేజీల విభాగంలో రజత పతకం సాధించారు. బాలురు విభాగంలో విశాఖపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన నెల్లి గణేష్ కాంస్య పతకం సాధించారు. వెయిట్ లిఫ్టింగ్ అండర్-19 బాలికల విభాగంలో తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోని రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన కారంగి హేమశ్రీ 55 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించారు. 71 కేజీల విభాగంలో ఏలూరు జిల్లా ధర్మాజీగూడెం శ్రీసాయి జూనియర్ కళాశాలకు చెందిన రీనుమోల్ పిఆర్ కాంస్య పతకం సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను, వారి కోచ్‌లు, మేనేజర్లను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ్‌రామరాజు, సమగ్రశిక్షా డైరెక్టర్ బి శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు.


కేజ్రీవాల్ అతిషి

ఆప్ తుది జాబితా విడుదల

న్యూఢిల్లీ : త్వరలో జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం ఆప్ తుది జాబితాను ఆదివారం విడుదల చేసింది. 38 మంది అభ్యర్థులతో విడుదల చేసిన ఈ నాలుగో, చివరి జాబితాతో అన్ని అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల ఎంపికను ఆప్ పూర్తి చేసింది. ఈ జాబితా ప్రకారం న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్, కల్కాజి నుంచి ముఖ్యమంత్రి అతిషి పోటీలో నిలిచారు. మంత్రులు సౌరభ్ భరద్వాజ్, గోపాల్ రాయ్, ఇమ్రాన్ హుస్సైన్, రఘువీంద్ర షోకీన్, ముకేష్ కుమార్ అహ్లావత్ వరసగా గ్రేటర్ కైలాష్, బాబర్‌పూర్, బల్లిమరన్, నంగ్లోజి, సుల్తాన్‌పూర్ మజ్రా నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది ప్రారంభంలో జరగనున్నాయి. 2020లో జరిగిన ఎన్నికల్లో 70 స్థానాల్లోకు గాను ఆప్ 62 స్థానాల్లో విజయం సాధించింది.

జనజీవన స్రవంతిలో కలవండి

- మావోయిస్టులకు అమిత్ షా పిలుపు

న్యూఢిల్లీ : జనజీవన స్రవంతిలో కలవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. మావోయిస్టులను కోరారు. లేకపోతే.. భద్రతా దళాలతో కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పారు. లొంగిపోయే మావోయిస్టులకు పునరావాస కల్పిస్తామని చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లోని జగ్‌దళ్‌పూర్‌లో నిర్వహించిన 'బస్తర్ ఒలంపిక్స్' ముగింపు వేడుకల్లో ఆయన ప్రసంగించారు. 2026 మార్చి నాటికి దేశాన్ని మావోయిస్టు రహితంగా మారుస్తామని తెలిపారు. 2026, మార్చి 31 నాటికి భారత్‌ను మావోయిస్టు రహితంగా మార్చాలన్న ప్రధాని మోడీ సంకల్పాన్ని నెరవేర్చేలా ఛత్తీస్‌గఢ్ పోలీసులు నిబద్ధతతో పనిచేస్తున్నారని చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత చర్యలు వేగవంతమయ్యాయనీ, ఈ చర్యలతో ఏడాదిలో 287 మంది మావోయిస్టులు చనిపోరని, మరో 992 మంది మావోయిస్టులను అరెస్టు చేసినట్లు తెలిపారు. కాగా.. 836 మంది లొంగిపోయారని చెప్పారు.

'జమిలి' బిల్లులపై వెనక్కి తగ్గిన కేంద్రం

న్యూఢిల్లీ : జమిలి ఎన్నికలకు సంబంధించి లోక్‌సభలో సోమవారం రెండు బిల్లులు ప్రవేశపెట్టాలని నిర్ణయించిన నరేంద్ర మోడీ ప్రభుత్వం గంటల వ్యవధిలోనే వెనక్కి తగ్గింది. ఈ వారం చివరలో ఈ బిల్లులు సభ ముందుకు వచ్చే అవకాశం ఉన్నదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇతర కార్యక్రమాలు చేపట్టడానికి ముందు గ్రాంట్లకు సంబంధించిన తొలి అనుబంధ డిమాండ్లకు సభ ఆమోదం పొందాలని ప్రభుత్వం భావిస్తోందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నదని ఆ వర్గాలు వివరించాయి. ఈ నెల 20న పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ముగుస్తాయి. లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదనను అనేక ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. బిల్లులను ప్రవేశపెట్టే దశలోనే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయాలని ఆ పార్టీలు యోచిస్తున్నాయి.

సోమవారం చేపట్టబోయే సభా కార్యక్రమాలను లోక్‌సభ వెబ్‌సైటులో ప్రచురించారు. దీని ప్రకారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ 129వ రాజ్యాంగ సవరణ బిల్లును, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లును సభలో ప్రవేశపెట్టాల్సి ఉంది. జమిలి ఎన్నికల నిర్వహణకు వీలుగా ఈ రెండు బిల్లులను రూపొందించారు. అయితే ఆశ్చర్యకరంగా కొన్ని గంటల వ్యవధిలోనే ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. దిగువ సభ వెబ్‌సైటులో సవరించిన సభా కార్యక్రమాలను పోస్ట్ చేశారు. తొలుత ప్రచురించిన కార్యకలాపాల జాబితా ఉండి ఈ రెండు బిల్లులను తొలగించారు. బిల్లులను ముందుగా సభలో ప్రవేశపెట్టి, ఆ తర్వాత సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపుతారని తొలుత వార్తలు వచ్చాయి. సభలో చేపట్టే కార్యక్రమాల నుండి ఈ రెండు బిల్లులను తొలగించినప్పటికీ నిబంధనల ప్రకారం అనుబంధ జాబితా ద్వారా వాటిని ప్రభుత్వం సోమవారం సభలో ప్రవేశపెట్టవచ్చు.



మహారాష్ట్ర క్యాబినెట్ విస్తరణ

- మంత్రులుగా 39 మంది ప్రమాణం

నాగ్‌పూర్ : మహారాష్ట్ర క్యాబినెట్ విస్తరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముగ్గురు మహిళలు సహా 39 మంది మంత్రులుగా పదవీ స్వీకార ప్రమాణం చేశారు. నాగ్‌పూర్‌లోని రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ సిపి రాధాకృష్ణ మంత్రులతో ప్రమాణం చేయించారు. దీంతో రాష్ట్ర రెండో రాజధాని అయిన నాగ్‌పూర్‌లో 33 ఏళ్ల తరువాత జరిగిన పదవీ స్వీకార ప్రమాణోత్సవ కార్యక్రమంగా ఇది నిలిచింది. మంత్రులుగా ప్రమాణం చేసినవారిలో బిజెపి నుంచి 19 మంది, శివసేన (ఏక్‌నాథ్ షిండే) నుంచి 11 మంది, ఎన్‌సిపి (అజిత్ పవార్) నుంచి తొమ్మిది మంది ఉన్నారు. ఈ విసర్తణతో మంత్రుల సంఖ్య 42కు చేరింది. ఈ నెల 5న ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రులుగా ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ ప్రమాణస్వీకారం చేసిన సంగతి తెలిసిందే.

దొడ్డిదారిన 'నల్లచట్టాలు' !

- గుట్టుచప్పుడు కాకుండా వ్యవసాయ మార్కెటింగ్ పాలసీ
- రద్దు చేసిన చట్టాల్లోని అంశాలతోనే ముసాయిదా
- రైతు సంఘాల ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

చారిత్రాత్మక రైతు ఉద్యమంతో రద్దు చేసిన నల్ల చట్టాలను మరో పేరుతో అమలు చేయడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోంది. వ్యవసాయ మార్కెటింగ్‌పై ఈ ఏడాది నవంబర్ 25న గుట్టుచప్పుడు కాకుండా ఒక పాలసీని కేంద్రం విడుదల చేసింది. అయితే దీని గురించి ఎక్కడా ప్రస్తావించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను అదానీ వంటి బడా కార్పొరేట్ దిగ్గజాలకు కట్టబెట్టేందుకు వీలుగా తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలను విశాల పోరాటాలతో అన్నదాతలు తిప్పికొట్టిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అవే చట్టాలను వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధానం పేరుతో దొడ్డిదారిన అమల్జేసేందుకు మోడీ సర్కార్ కుట్ర పన్నుతోందని, అందులో భాగంగానే ముసాయిదాను గుట్టచప్పుడు కాకుండా రూపొందించారని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీస మద్దతు ధర ఇతర సమస్యల పరిష్కారం కోసం శంభులోని పంజాబ్-హర్యానా సరిహద్దులో రైతులు పెద్ద ఎత్తున నిరసనలను కొనసాగిస్తున్నారు. అయితే ముసాయిదాలో కనీస మద్దతు ధర అంశాన్ని కూడా ప్రస్తావించలేదని తెలుస్తోంది.

రాష్ట్రాల అంశాలపై కేంద్రం జోక్యం

వ్యవసాయ మార్కెటింగ్‌కు ఏకీకృత జాతీయ విధానం అవసరం అంటూ ఆ పేరిట రాష్ట్రాల హక్కులను గుంజేసుకోవడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయం, వ్యవసాయ మార్కెటింగ్ రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర జాబితాలోని అంశం. వ్యవసాయ పరిశోధన అంశం కేంద్ర జాబితాలో ఉంది. ఇప్పుడు జాతీయస్థాయి ఫ్రేమ్‌వర్క్ పేరిట వ్యవసాయంలోనూ, వ్యవసాయ మార్కెట్‌లోనూ కేంద్రం జోక్యం చేసుకొని దానిని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రమాదముంది. వ్యవసాయ వాణిజ్య ప్రక్రియల ఆటోమేషన్, డిజిటలైజేషన్‌పై దృష్టి సారించాలని ముసాయిదా చెబుతోంది. ఫీజులు, లైసెన్సులు, నిబంధనలను క్రమబద్ధీకరించి వ్యవసాయ వాణిజ్యాన్ని సులభతరం చేయడానికి వీలు కల్పిస్తోంది. దేశవ్యాప్తంగా ఏకీకృత జాతీయ వ్యవసాయ మార్కెట్ పోర్టల్‌ను రూపొందించాలని ప్రతిపాదించింది. మార్కెట్ వ్యవస్థలను ఒకే గొడుగుకు కిందకు తీసుకురావాలని పేర్కొంది. ఈ ప్రతిపాదనలన్నీ కార్పొరేట్ అగ్రి కంపెనీలకు అనుకూలమైనవేనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమాఖ్య స్ఫూర్తిని కూడా ఈ ఫ్రేమ్‌వర్క్ దెబ్బతీస్తుందని పేర్కొన్నారు.


దిస్సానాయకేకు స్వాగతం పలుకుతున్న కేంద్ర సహాయ మంత్రి మురుగన్

భారత్ చేరుకున్న దిసనాయకే

న్యూఢిల్లీ : భారత్‌లో మూడు రోజుల పర్యటన కోసం ఆదివారం న్యూఢిల్లీకి శ్రీలంక అధ్యక్షులు అనుర కుమార దిసనాయకే చేరుకున్నారు. కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎస్ మురుగన్, దౌత్య అధికారులు దిస్సానాయకేకు స్వాగతం పలికారు. సెప్టెంబరులో అధ్యక్షులుగా ఎన్నికైన తరువాత దిసనాయకేకు ఇదే మొదటి విదేశీ పర్యటన. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఆహ్వానం మేరకు ఈ పర్యటనకు వచ్చారు. భారత్‌తో దౌత్య సంబంధాలను మరింత బలపర్చడం, ఇరు దేశాల వివిధ రంగాల్లో సహకారాన్ని విస్తరించడం ప్రధాన లక్ష్యంగా ఈ పర్యటన సాగనుందని శ్రీలంక అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి జై శంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో దిసనాయకే మధ్య చర్చలు జరిగాయి.

మేము దేశంలో భాగం కాదా?

- ప్రజలకు ప్రధాని ఎందుకు సమాధానం చెప్పలేదు?
- లోక్‌సభలో మణిపూర్ ఎంపీ ప్రశ్నలు

న్యూఢిల్లీ : లోక్‌సభలో రాజ్యాంగం చర్చ సందర్భంగా మణిపూర్ కాంగ్రెస్ ఎంపీ ఆల్ఫ్రెడ్ కన్నగమ్ ఆర్థర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మేము దేశంలో భాగం కాదా? అని ప్రశ్నించారు. భారత రాజ్యాంగంపై జరిగిన రెండ్రోజుల చర్చలో భాగంగా ఔటర్ మణిపూర్ ఎంపీ ఆల్ఫ్రెడ్ లోక్‌సభలో మాట్లాడారు. మణిపూర్‌లో నెలకొని ఉన్న హింసాత్మక పరిస్థితులు, నాగాలాండ్‌లో 2021లో జరిగిన ఒటింగ్ మారణకాండను పేర్కొన్న ఆయన.. రాజ్యాంగం పట్ల ప్రభుత్వ నిబద్ధతను ప్రశ్నించారు. 2021, డిసెంబర్ 4న భారత ఆర్మీ చేతిలో నాగాలాండ్‌లోని మోన్ జిల్లా ఒటింగ్ గ్రామానికి చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత జరిగిన హింసలో మరో ఎనిమిది మంది పౌరులు, ఒక సైనికుడు మృతి చెందారు. "ఒటింగ్ మారణహోమం జరిగినప్పుడు రాజ్యాంగం ఎక్కడున్నది? ప్రజల ఆందోళనలను తగ్గించటానికి బిజెపి ఒటింగ్ నుంచి రాజ్యసభకు ఒక ఎంపీని పంపితే సరిపోతుందా? మణిపూర్‌లో 19 నెలలుగా కొనసాగుతున్న సంక్షోభాన్ని ఎవరూ గుర్తు చేయాల్సినవసరం లేదు. మేము ఈ దేశంలో భాగం కాదా? దీనిపై ప్రధాని ఇప్పటి వరకూ మణిపూర్ ప్రజలకు ఎందుకు సమాధానం చెప్పలేదు?" అని ఆయన ప్రశ్నించారు.

రాజ్యాంగంపై చర్చ సందర్భంగా ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీ రామ్) ఎంపీ చంద్రశేఖర్ "ఆజాద్" మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని, దాని రూపకర్తలను కొనియాడారు. చాలా అణగారిన వర్గాలు ఎంతో కొంత పురోగతి సాధించాయంటే అది రాజ్యాంగం కారణంగానేనని అన్నారు. రాజ్యాంగంలో నిర్దేశించిన మత స్వేచ్ఛ దళితులు, ముస్లింలు, జైనులు, క్రైస్తవులు, బుద్ధులకు ఎక్కడున్నదని ఆయన ప్రశ్నించారు. ఛత్తీస్‌గఢ్‌లో సత్నామీ పంత్ స్మారక చిహ్నం ధ్వంసం విషయంలో అశాంతి, యూపీలోని సంభాల్‌లో హింసను ఆయన లేవనెత్తారు.


రాజ్యాంగంపై లోక్‌సభలో జరిగిన చర్చలో ప్రసంగిస్తున్న మణిపూర్ కాంగ్రెస్ ఎంపి ఆల్ఫ్రెడ్ కన్నగమ్ ఆర్థర్

'ప్రయివేటీకరణ రిజర్వేషన్‌పై దాడి'

బంగ్లాదేశీల చొరబాట్ల విషయంలో బిజెపి చేసిన ప్రచారంపై జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) ఎంపీ విజయ్ కుమార్ హన్స్‌డాక్ మాట్లాడారు. భారత రాజ్యాంగం, రాజ్యాంగబద్ధత మీద ప్రపంచ దృక్కోణంపై అధికార సభ్యులు చాలా చర్చించారనీ, ఈ సభ్యులే జార్ఖండ్‌కు వచ్చి బంగ్లాదేశీయుల గురించి మాట్లాడారని అన్నారు. అయితే, హరించుకుపోతున్న మా వనరుల, భూముల గురించి మాత్రం వారికి పట్టింపు లేదని చెప్పారు. ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా చంద్రశేఖర్, విజయ్ కుమార్‌లు గళం వినిపించారు. దీనిని రిజర్వేషన్‌పై 'బ్యాక్‌డోర్ దాడి'గా వారు అభివర్ణించారు.

సిరియాపై ఆంక్షలను ఉపసంహరించండి

- ఐరాసలో ప్రత్యేక రాయబారి విజ్ఞప్తి

డమాస్కస్ : తమ దేశంపై విధించిన ఆంక్షలను ఉపసంహరించుకోవాలని పాశ్చాత్య దేశాలకు ఐరాసలో సిరియా ప్రత్యేక రాయబారి గీర్ ఫెడర్సెన్ ఆదివారం విజ్ఞప్తి చేశారు. దేశంలో బషర్ అసాద్ పాలన ముగిసిన నేపథ్యంలో 'ఆంక్షలను అతి త్వరలోనే ఎత్తివేస్తారని కోరుకుంటున్నాం. తద్వారా సిరియా నిర్మాణాన్ని చేపట్టగలం' అని ఆదివారం ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో గీర్ ఫెడర్సెన్ తెలిపారు. అస్సాద్ ప్రభుత్వం నేలకూలిన తరువాత ఏర్పాటైన తాత్కాలిక ప్రభుత్వంతో సమావేశం కోసం డమాస్కస్‌కు గీర్ ఫెడర్సెన్ వచ్చారు. తొలిసారిగా స్వదేశం వచ్చిన నేపథ్యంలో గీర్ ఫెడర్సెన్ విలేకరులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. తమదేశస్థులంతా రాజకీయంగా ఐక్యతతో అభివృద్ధిలో పంచుకుంటారని చెప్పారు. అలాగే యుద్ధ సమయంలో జరిగిన నేరాల్లో బాధితులకు న్యాయం, జవాబుదారీతనం ఉండాలని పిలుపునిచ్చారు. సిరియాకు మానవతావాద సహాయాన్ని వేగవంతం చేయాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరారు. అంతర్యుద్ధం, తిరుగుబాటు వంటి కారణాలతో 2011 నుంచి సిరియాపై అమెరికా, యూరోపియన్ యూనియన్, ఇతర దేశాలు కఠినమైన ఆంక్షలను అమలు చేస్తున్నాయి.



మీకోసం

కాఫీ పొడి గడ్డకట్టకుండా ఉండాలంటే ఎయిర్‌టైట్ డబ్బాలో నిల్వచేసి, డీప్ ఫ్రిజ్‌లో ఉంచాలి.

జీవన సౌరభం

మాట్లాడిన తర్వాత ఆలోచించడం కాదు, ఆలోచించిన తర్వాతే మాట్లాడాలి.

రాజు గారి కోరిక



శక్తివర్మ మహారాజు తన చిత్రపటం గీయమని చిత్రకారులకు పోటీ పెట్టారు. అనేకమంది చిత్రకారులు ఆయన చిత్రపటాలు గీశారు. వాటిలో నాలుగు బొమ్మలు శక్తివర్మకు నచ్చాయి. వాటిని గీసిన చిత్రకారులను ఆయన తన ఏకాంత మందిరానికి పిలిపించారు.

ఆ నలుగురు చిత్రకారులతో 'మీరు గీసిన నా చిత్రపటాలు చాలా బాగున్నాయి' అంటూ రాజు గారు తన కిరీటాన్ని తీసి చూపించారు. ఆయన పూర్తి బట్టతలతో ఉన్నారు. కిరీటంతో ఉన్న రాజుగారికి, ఇలా బట్టతలతో ఉన్న రాజుకి ఎంతో తేడా కనిపించింది. మళ్లీ రాజుగారు మాట్లాడుతూ 'ఒకే చిత్రంలో నేను కిరీటం పెట్టుకుని అలంకరించుకుని తయారైనప్పుడు ఉండే నా ముఖము కనిపించాలి, ఇంకా కిరీటం లేకుండా బట్టతలతో ఉన్న నా ముఖం కూడా కనిపించాలి. అయితే ఈ విషయం ఎవరికీ అర్థం కాకూడదు. అలాంటి చిత్రం గీసినవారిని ఆస్థాన చిత్రకారునిగా నియమిస్తాను' అన్నారు.

అలా గీయటం మా వల్ల కాదంటూ ముగ్గురు చిత్రకారులు వెళ్ళిపోయారు. రామబ్రహ్మం అనే చిత్రకారుడు మాత్రం 'మహారాజా, మీరు కోరిన చిత్రాన్ని నేను గీస్తాను. నాకు నెల రోజులు సమయం కావాలని' అన్నాడు. నెలరోజుల తర్వాత చిత్రపటాన్ని గీసుకొని వచ్చాడు రామబ్రహ్మం. రాజుగారు తన ఏకాంత మందిరంలో ఆ చిత్రపటాన్ని చూశారు. చిత్రపటంలో కిరీటం పెట్టుకున్న రాజుగారి ముఖం మాత్రమే ఉంది.

'అదేంటీ, 'ఈ చిత్రంలో నా బట్టతల ముఖం కనిపించటం లేదు. నేను చెప్పింది నీకు సరిగ్గా అర్థం కాలేదా' అని రాజు కోపంగా అడిగాడు.

'క్షమించండి మహారాజా' అంటూ ఆ చిత్రాపటాన్ని తలకిందులు చేసి చూపించాడు రామబ్రహ్మం. అప్పుడు అందులో బట్టతలతో ఉన్న రాజు గారి ముఖం కనిపించింది.

'అద్భుతం!' అంటూ రాజుగారు రామబ్రహ్మంను ఆనందంతో ఆలింగనం చేసుకున్నారు. 'నిజానికి నాకు కావలసింది నా చిత్రపటం గీసే చిత్రకారుడు కాదు. ప్రజా ప్రయోజనం కలిగించే వివిధ విషయాలను ప్రజలకు అర్థమయ్యేలాగా చిత్రాల రూపంలో గీయించి, రాజ్యంలో వివిధ ప్రదేశాలలో ప్రదర్శించాలి అనేది నా చిరకాల కోరిక. దానికి సమర్థవంతుడైన చిత్రకారుడు కావాలి. అందుకే నేను చిత్రకారులకు పోటీ పెట్టాను. నువ్వే అందుకు తగిన వాడివి' అంటూ రాజుగారు రామబ్రహ్మంను తన ఆస్థాన చిత్రకారునిగా నియమించారు.

- కళ్ళేపల్లి తిరుమలరావు
9177074280


లెక్క చేయండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న గళ్లల్లో ఉన్న అంకెల ఆధారంగా మీరు లెక్క చేయాలి. నిలువు, అడ్డం వరుసల్లో ఎటువైపు కూడినా సమాధానం 15 రావాలి మరి.

2		6
9	5	
	3	8

నేను గీసిన బొమ్మ





జి.కుస్మిత,
8వ తరగతి,
అరవింద హైస్కూల్,
కుంచనపల్లి,
గుంటూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

నడుద్దాం.. ఆరోగ్యంగా ఉందాం...



ఉదయం లేచిన దగ్గర నుంచి పడుకొనే వరకూ ఉద్యోగమో, వ్యాపారమో, ఉరుకులు, పరుగుల జీవితాన్ని గడుపుతుంటాం. బిజీ లైఫ్‌లో బైక్, ఆటో, బస్సు, రైళ్లు ఇలా దూరాన్ని బట్టి ప్రయాణాలు చేస్తుంటాం. వీధి చివర్లో ఉండే కిరాణా దుకాణానికి కూడా బండి వాడుతుంటాం. నడవటానికి అవకాశం ఉన్నాకానీ బండే వాడుతుంటాం. అందువల్లే ఊబకాయం, కొలెస్ట్రాల్, బిపి, మధుమేహం వంటి వ్యాధుల బారినపడుతుంటాం. అలాకాకుండా దగ్గర పనులకు నడిస్తే శరీరానికి ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. ప్రతిరోజూ నడవటం వల్ల శరీరంలో ఉండే చెడు వ్యర్థాలు పోయి ఆరోగ్యంగా తయారవుతాం. ఫిట్‌గా ఉంటాం. అందుకే డాక్టర్లు క్రమం తప్పకుండా నడక లేదా వ్యాయామం చేయాలని సూచిస్తుంటారు. నడక వల్ల ఒనగూరే ప్రయోజనాలేమిటో తెలుసుకుందాం.

నడక అందరూ చేయదగిన వ్యాయామం. చాలా తేలిక కూడానూ. సహజమైన, ఎప్పుడైనా, ఎక్కడైనా చేయటానికి వీలైన, తేలికైన వ్యాయామం. మధుమేహ రోగులు నడిస్తే మరిన్ని ప్రయోజనాలు ఉంటాయి. నడక వల్ల వచ్చే ప్రయోజనాలు తెలిసినా కొందరు పొద్దున్నే లేవాలా? అంటూ బద్ధకిస్తుంటారు. రోజువారీ పనుల్లో అలసిపోయి వచ్చామనే పేరుతో సమర్థించుకుంటుంటారు. కాసేపు సేద తీరటానికి టీవీ చూడటంలో తప్పులేదు. పని ప్రదేశంలో కంప్యూటర్ ముందు, లేదా కాలక్షేపంగా టీవీ ముందు గంటల తరబడి కూర్చోవటం ఏమాత్రం మంచిది కాదు. టెలివిజన్‌లో సీరియల్స్, సినిమాలు, ఆటలు వంటివి ప్రసారాలు చూస్తున్నప్పుడు మధ్య మధ్యలో చిరుతిండ్లు, ఒక్కోసారి భోజనాలు సైతం చేసేస్తుంటారు. ఇలా చేస్తే ఎంత తిన్నామో తెలియదు. అధునాతన టెక్నాలజీ, కమ్యూనికేషన్ వ్యవస్థ పెరిగిన క్రమంలో ఆర్డరు పెడితే ఇంటికే సరుకులు, ఆహార పదార్థాల పార్శిళ్లు వచ్చేస్తున్నాయి. కారణాలు ఏమైనా గతంలో మాదిరిగా శ్రమశాతం తగ్గింది. ఫలితంగా ఎక్కువమంది రక రకాల రోగాలతో బాధపడుతున్నారు.

ప్రశాంతంగా నడవండి

ఈ ఉరుకులు, పరుగుల జీవితంలో కాస్త సమయం కేటాయించి నడక ప్రారంభిస్తే క్రమేణా అనారోగ్య సమస్యలు కూడా తగ్గిపోతాయి. 'నడకే మనిషికి మంచి ఆరోగ్యం' అని పెద్దలు అంటుంటారు. వ్యాయామం చేసినా, ఆటలు ఆడినా, నడక నడిచినా, పరుగెత్తినా ఎంతోకొంత ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. అయితే ఇది క్రమం తప్పకుండా ప్రతిరోజూ ఉదయమో, సాయంత్రమో చేయాలి. శరీరంలో ఉండే కొవ్వు, ఇతర వ్యర్థాలు కొంతమేరకు చెమట రూపంలో పోతాయి. శరీరం దృఢంగానూ, ఆరోగ్యం మెరుగ్గానూ మారుతుంది. ఎక్సర్‌సైజుల్లో నడకను మించిన తేలికపాటి వ్యాయామం మరొకటి లేదు. ఏ వయస్సు వారైనా ఎప్పుడైనా, ఎక్కడైనా నడకను కొనసాగించొచ్చు. దీనికోసం పైసా ఖర్చు పెట్టాల్సిన పనిలేదు. మిగతా వ్యాయామాల కన్నా సురక్షితం కూడాను. నడక వలన బరువు తగ్గటంతోపాటు ఎన్నో ఉపయోగాలు, మరెన్నో ప్రయోజనాలు ఉన్నాయి. నడక-దానివల్ల కలిగే ఉపయోగాలేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

ఒత్తిడి తగ్గుతుంది : ప్రతిరోజూ నడవటం వల్ల శరీరంలో ఉండే ఎండార్ఫిన్లు అనే హార్మోన్లు విడుదలవుతాయి. ఇవి మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్, కంగారు వంటి సమస్యలు తగ్గుతాయి. వయస్సు మీద పడటం వల్ల వచ్చే డెమెంతియా, అల్జీమర్స్ వంటి వ్యాధులు రాకుండా ఉంటాయి.

కంటిపై ఒత్తిడి దూరం : కంటికి సంబంధించిన పలు నాడులు కాళ్లలో ఉంటాయి. అందుకనే నడవటం వల్ల కంటి ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. నిత్యం నడక సాగించటం వల్ల కళ్లపై అధిక ఒత్తిడి తగ్గటంతోపాటు గ్లకోమా వంటి కంటి వ్యాధులు రాకుండా ఉంటాయి.

గుండెపోట్లు రావు : ప్రతిరోజూ నడిచినా, పరుగెత్తినా గుండె సమస్యలు తగ్గుతాయి. గుండెపోట్లు వంటివి రావు. హైబీపీ, కొలెస్ట్రాల్ వంటివి కూడా తగ్గుముఖం పడతాయి. శరీరంలో రక్త సరఫరా మెరుగుపడుతుంది.

విష, వ్యర్థ పదార్థాలు దూరం : నడవటం వల్ల శరీరం ఆక్సిజన్‌ను ఎక్కువగా గ్రహిస్తుంది. అదే ఆక్సిజన్ రక్తంలో చేరి ఊపిరితిత్తులకు చేరుతుంది. ఊపిరితిత్తుల్లో ఉండే టాక్సిన్లు, విష, వ్యర్థ పదార్థాలను ఆక్సిజన్ బయటకు పంపుతుంది. ఇతర ఊపిరితిత్తుల సమస్యలు కూడా దూరమవుతాయి.

అదుపులో మధుమేహం : మధుమేహం ఉన్న వారు నిత్యం నడిస్తే చాలా ప్రయోజనాలు ఉంటాయి. ఆరునెలలపాటు క్రమం తప్పకుండా నడక లేదా పరుగు చేసిన కొందరు మధుమేహ రోగులను పరిశీలించగా వారి రక్తం స్థాయిలో గ్లూకోజ్ స్థాయిలో బాగా అదుపులోకి వచ్చినట్లుగా శాస్త్రవేత్తలు గుర్తించారు. అందువల్ల రోజూ నడిస్తే మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోవచ్చు.

క్యాన్సర్ ముప్పు తగ్గుతుంది : ప్రతిరోజూ కనీసం 30 నిముషాలపాటు నడిస్తే పెద్దపేగు క్యాన్సర్ వచ్చే ముప్పు చాలా తగ్గుతుంది. జీర్ణప్రక్రియ మెరుగుపడుతుంది. మలబద్ధకం పోతుంది. విరేచనం రోజూ సాఫీగా అవుతుంది. ప్రతిరోజూ 100 నిముషాలపాటు వాకింగ్ చేస్తే అధిక బరువు నుంచి కొందవరకు తగ్గుతారని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. కండరాలు కూడా దృఢంగా మారుతాయి.



కీళ్ల నొప్పులకు చెక్ : ప్రతిరోజూ నడవటం వల్ల కీళ్లు బాగా పనిచేస్తాయి. త్వరగా అవి అరిగిపోవటం జరగదు. ఎముకల్లో సాంద్రత కూడా పెరుగుతుంది. ఫ్రాక్చర్లు, కీళ్ల నొప్పులు వచ్చే అవకాశాలు తగ్గుతాయి. దీనికోసం రోజూ కనీసం 30 నిముషాలపాటైనా నడవాలి. ఇలా చేస్తే కీళ్ల నొప్పులు, వాపులు కూడా తగ్గుతాయి.

బరువు తగ్గుతుంది : మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లు ఊబకాయానికి దారితీస్తున్నాయి. చిన్నపిల్లల దగ్గర నుంచి ముసలి వారి వరకూ దీని బారిన పడుతున్నారు. బరువు తగ్గించుకోవటానికి మించిన వ్యాయామం లేదు. ఒక పౌండు బరువు పెరగటం అంటే అదనంగా 3500 క్యాలరీలు శరీరంలో వచ్చి చేరాయన్నమాటే. ప్రతిరోజూ క్రమం తప్పకుండా నడిస్తే వారంలో ఒకపౌండు బరువు తగ్గే అవకాశం ఉంది. ఒక మైలు దూరాన్ని 13 నిముషాల అంతకన్నా తక్కువ సమయంలో నడిస్తే క్యాలరీలను ఎక్కువగా కరిగించుకోవచ్చు. ఒక మైలు దూరం నడిస్తే వంద క్యాలరీలు ఖర్చవుతాయి.

మరికొన్ని ప్రయోజనాలు

- రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.
- గుండె సమర్థవంతంగా పనిచేస్తుంది.
- రక్త ప్రసరణ వేగవంతం
- చెమట ద్వారా రక్తంలోని మలినాలు బయటకు పోతాయి
- చెడు కొలెస్ట్రాల్ తగ్గి మంచిది పెరుగుతుంది
- రక్తంలో గ్లూకోజు స్థాయి తగ్గుతుంది
- శరీర బరువు తగ్గుతుంది
- మానసిక కుంగుబాటు, ఆందోళన, ఒత్తిడి తగ్గుతాయి
- కంటి నిండా నిద్రపడుతుంది
- క్యాన్సర్ల ముప్పు తగ్గుతుంది
- కీళ్లు, ఎముకలు దృఢమవుతాయి
- నీరసం, అలసట, నిస్సత్తువ తగ్గుతాయి
- మెరుగైన ఆత్మవిశ్వాసం, శారీరక సామర్థ్యం
- మానసిక ఉల్లాసం



అభిమానం సరే.. అత్యుత్సాహం వద్దు ...

సినిమా.. సినిమా.. ఆ రంగుల ప్రపంచంలో జరిగే విషయాలపై ఎప్పుడూ ఆసక్తే. ఫలానా హీరో, హీరోయిన్ ఏం తింటారు, ఏం తాగుతారు, ఏం మాట్లాడతారు, ఉదయం ఎన్నింటికి నిద్రలేస్తారు... ఎన్నింటికి పడుకుంటారు.. ఇలా వాళ్ల రోజు మొదలైన దగ్గర నుండి రాత్రి నిద్రపోయే వరకు ప్రతి ఒక్కటీ తెలుసుకోవాలని ఎంతో కుతూహలం. వాళ్లింట్లో జరిగే విందులు, వినోదాలంటే మహా క్రేజ్. వాళ్ల సంతోషాలు, విచారాలు పట్టించుకోకుండా ఏ అభిమానీ నిద్రపోరు.

ఇప్పుడు కాలం బాగా మారిపోయింది. ఒకప్పటిలా హీరోలకు, హీరోయిన్లకు అభిమానసంఘాలు కాదు, ఆర్మీలు నడుస్తున్నాయి. 'నేను ఫలానా హీరో అభిమానిని అన్న స్థాయి నుండి ఆ హీరో ఆర్మీని నేను' అనే స్థితికి ప్రేక్షకులు చేరారు. అభిమాన హీరోని ఎవరైనా కామెంట్ చేస్తే చాలు, సోషల్‌మీడియా వేదికగా ఆర్మీ ఎలర్ట్ అయిపోతుంది. కంట్రోల్ తప్పి మరీ కామెంట్ల హోరు నడుస్తుంది.

ఇటీవల టాలీవుడ్‌లో జరుగుతున్న పరిణామాలు-పర్యవసానాలు ఒకింత ఆందోళన కలిగిస్తున్నాయి. సినిమా వాళ్ల పర్సనల్ విషయాలు పబ్లిక్‌లోకి వచ్చి, పెద్ద గందరగోళం సృష్టిస్తున్నాయి. సినిమా ఇండస్ట్రీలో ఇలాంటివి షరా మామూలే అయినా, ఈ ధోరణి ఈమధ్య కాలంలో మరీ ఎక్కువైంది. సమంత విషయంలో నాగార్జునపై, తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యల నుండి పరిస్థితులు మరీ దారుణంగా తయారయ్యాయి. కేసులు, వాదోపవాదాల సంగతి పక్కనబెడితే, పబ్లిక్‌గా తమ హీరోని, హీరోయిన్‌ని అలా కామెంట్ చేయడం అభిమానులు తట్టుకోలేకపోయారు. ఆ సమయంలో సోషల్‌మీడియాలో మంత్రిపై చాలా దారుణమైన కామెంట్లు వచ్చాయి.

ఈమధ్య మోహన్‌బాబు ఇంటి గొడవ



రచ్చకెక్కిన సంగతి తెలిసిందే. ఆస్తితగాదాలు అన్నదమ్ముల మధ్య సృష్టించిన విభేదాలు తారాస్థాయికి వెళ్లాయి. తండ్రి కొడుకుల మధ్య యుద్ధ వాతావరణాన్ని తీసుకొచ్చాయి. ఈ మొత్తం వ్యవహారంలో 'మనోజ్‌కి అండగా మేమున్నామ'ంటూ అభిమానుల పేరుతో విష్ణు, మోహన్‌బాబుపై సోషల్‌మీడియాలో విపరీతమైన ట్రోలింగ్ చేస్తున్నారు. మరో వర్గం మనోజ్, అతని భార్య మౌనికపై కామెంట్లు పెడ్తున్నారు.

ఇక ఇప్పుడు అల్లు అర్జున్ విషయానికొస్తే, శుక్రవారం అతను అరెస్ట్ అయిన దగ్గర నుండి శనివారం ఉదయం విడుదలయ్యే వరకు మీడియా అటెన్షన్ అంతా ఆవైపే ఉంది. అభిమానులైతే అర్జున్‌ని కోర్టుకు తీసుకెళితే కోర్టుకి, హాస్పటల్‌కి తీసుకెళ్తే హాస్పటల్‌కి వచ్చేశారు. ఇక విడుదలైన తరువాత కూడా గీతా ఆర్ట్స్ దగ్గర, అర్జున్ ఇంటి దగ్గర ఒకటే జనం. ఈమధ్యలో అర్జున్ అరెస్ట్‌పై ఎన్నో ఊహాగానాలు నడిచాయి. సోషల్ మీడియాలో ఆయన అభిమానులు ఆర్మీ పేరుతో చేసిన రాద్ధాంతం అంతా ఇంతా కాదు.

నటీనటులపై అభిమానం పెంచుకోవడం తప్పేమీ కాదు. ఫలానా హీరోలా జుట్టు కత్తిరించుకోవడం దగ్గర నుండి ఆయన వేసిన బట్టలు, కళ్లజోడు, వాచీ ఇలా ప్రతి ఒక్కటీ అనుకరించడం ఏమంత చెడ్డ విషయాలు కావు. హీరోయిన్ అల్లుకున్న జడ, పెట్టుకున్న రబ్బరు బ్యాండు, వేసుకున్న బట్టలు, నగలు అనుకరించడం ఎప్పటినుండో ఉంది. అభిమాన హీరో సినిమా ఫస్ట్ డే, ఫస్ట్ షో చూడడం గొప్ప థ్రిల్‌గా భావించడం ఎప్పటినుండో ఓ ట్రెండ్. హీరో కటౌట్ ఎంత ఎత్తు పెడితే అంత అభిమానం ఉన్నదని చెప్పుకోవడం ఫ్యాషన్ అయిపోయి చాలాకాలమైంది. పాలాభిషేకాలు, పూలాభిషేకాలు, గుళ్లు, గోపురాలు కట్టడం, పచ్చబొట్లు పొడిపించుకోవడం ఇదంతా అభిమానమే. అయితే ఈ అభిమానం హద్దులు దాటనంత వరకే ముద్దుగా ఉంటుంది.

నటీనటులేమీ ఎక్కడి నుండో దిగి రాలేదు. ఆకాశం నుండి ఊడిపడలేదు. హీరోలు మన నుండే పుట్టుకొస్తారు. వాళ్లు ఎవరో సృష్టించిన అద్భుత వ్యక్తులు కాదు. ప్రేమలు, ఆప్యాయతలు, కోపాలు, తాపాలు మనలాగే వాళ్లకీ ఉంటాయి. ఈ విషయం అందరూ ఒప్పుకోవాలి. కానీ ఇప్పుడు అలా జరగడం లేదు. ముఖ్యంగా యువతలో అభిమానం పేరుతో ఆవేశం పెరిగిపోతోంది. హీరోకి ఏమైనా అయితేనా, ఎవరైనా ఏదైనా అంటేనా.. ఇక అంతే సంగతులు.. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఎలానో ఉండనే ఉంది. ఇంకేముంది వల్గర్ మాటలు, చేష్టలతో సోషల్‌మీడియాలో వార్ మొదలైపోతోంది. దాడుల వరకూ వెళ్లిన సందర్భాలు కూడా ఉన్నాయి.

హీరో అమ్మని, భార్యని, అత్తని, పిల్లలని, కోడలిని, కొడుకులని ఎంత ప్రేమగా చూసుకున్నాడో తెలుసుకోవడం కాదు, మన ఇంట్లో వాళ్లపై మనమెంత బాధ్యతగా ఉన్నామో గ్రహించాలి. హీరో కుటుంబాన్నే కాదు, మన కుటుంబాన్ని కూడా ప్రేమించాలి. వాళ్లు హీరోలు.. డబ్బు, పలుకుబడి బాగానే ఉంది. చుట్టూ మందీమార్బలం ఎలాగూ ఉంటుంది. సమస్యల నుండి వాళ్లెలాగో బయటికి వస్తారు. వాళ్ల చుట్టూ ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు మన సమయం ఎందుకు వృధా చేయాలి? మన చుట్టూ ఎన్నో సమస్యలు ఉన్నాయి. వాటిపై స్పందించాలి. నోరు తెరవాలి. ఇకనైనా కళ్లు తెరుద్దాం.. సమయం సద్వినియోగం చేసుకుందాం.

బౌలర్లు బేజారు



- రోజంతా చెమటోడ్చినా ఏడు వికెట్లే
- ట్రావిశ్ హెడ్, స్మిత్ శతక జోరు
- ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 405/7
- భారత్, ఆసీస్ మూడో టెస్టు రెండో రోజు

పచ్చికతో కూడిన పిచ్. వర్షంతో తొలి రోజు ఆటకు ఆటంకం. మేఘావృత వాతావరణం. సహజంగానే ఈ పరిస్థితుల్లో పేసర్లు వికెట్ల జాతర సాగిస్తారు. కానీ ట్రావిశ్ హెడ్ (152), స్టీవ్ స్మిత్ (101) శతక మోత మోగించారు. ట్రావిశ్ హెడ్ తనదైన శైలిలో భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఈ ఇద్దరు జోరందుకోగా ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు దిశగా సాగుతోంది. భారత పేస్ దళపతి జశ్‌ప్రీత్ బుమ్రా (5/72) ఐదు వికెట్ల ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు.

బ్రిస్బేన్ : భారత పేస్ దళపతి జశ్‌ప్రీత్ బుమ్రా (5/72) ఐదు వికెట్ల ప్రదర్శనతో నిప్పులు చెరిగినా.. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ మూడో టెస్టులో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు దిశగా దూసుకెళ్తోంది. విధ్వంసక బ్యాటర్ ట్రావిశ్ హెడ్ (152, 160 బంతుల్లో 18 ఫోర్లు) మరోసారి భారత్‌పై విరుచుకుపడ్డాడు. తాజా సిరీస్‌లో మరో కండ్లుచెదిరే ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. సంప్రదాయ బ్యాటర్ స్టీవ్ స్మిత్ (101, 190 బంతుల్లో 12 ఫోర్లు) పేలవ ఫామ్‌కు చెక్ పెడుతూ సెంచరీతో కదం తొక్కాడు. అలెక్స్ కేరీ (45 నాటౌట్, 47 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) అజేయ ఇన్నింగ్స్‌తో మెరిశాడు. గబ్బా టెస్టులో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 101 ఓవర్లలో 405/7 పరుగులు చేసింది. మిచెల్ స్టార్క్ (7 నాటౌట్), అలెక్స్ కేరీ అజేయంగా క్రీజులో నిలిచారు. నేడు ఉదయం సెషన్లో వీలైనన్ని ఎక్కువ పరుగులు పిండుకునేందుకు ఆసీస్ ఎదురుచూస్తోంది!. తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరుతో భారత్‌పై ఆతిథ్య ఆస్ట్రేలియా ఒత్తిడి పెంచింది.

హెడ్, స్మిత్ శతక్కొట్టారు : ఓవర్‌నైట్ స్కోరు 28/0తో రెండో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన ఆస్ట్రేలియా ఉదయం సెషన్లో మూడు వికెట్లు కోల్పోయింది. జోరుమీదున్న ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా (21) సహా యువ ఓపెనర్ నాథన్ మెక్‌స్వీనీ (9)లను బుమ్రా సాగనంపాడు. మార్నస్ లబుషేన్ (12)ను తెలుగు తేజం నితీశ్ అవుట్ చేశాడు. ఉదయం సెషన్లో ఆసీస్ టాప్ ఆర్డర్‌పై ఒత్తిడి పెంచిన బౌలర్లు మూడు వికెట్లు వేగంగా పడగొట్టారు. కానీ స్టీవ్ స్మిత్ (101), ట్రావిశ్ హెడ్ (152) నాల్గో వికెట్‌కు భారీ భాగస్వామ్యం నమోదు చేశారు. ఈ జోడీ నాల్గో వికెట్‌కు 303 బంతుల్లోనే 241 పరుగులు చేశారు. ఓ ఎండ్‌లో హెడ్ ధనాధన్ దంచికొట్టగా.. మరో ఎండ్‌లో స్మిత్ బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. దీంతో రెండో సెషన్లో భారత బౌలర్లకు ఒక్క వికెట్ కూడా దక్కలేదు. ఆడిలైడ్ జోరు కొనసాగించిన ట్రావిశ్ హెడ్ ఆరు ఫోర్లతో 71 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించాడు. 13 ఫోర్లతో 115 బంతుల్లో సెంచరీ బాదాడు. మరో వైపు స్టీవ్ స్మిత్ 128 బంతుల్లో నాలుగు ఫోర్ల సాయంతో అర్థ సెంచరీ అందుకున్నాడు. వరుస మ్యాచుల్లో పేలవ ప్రదర్శనతో ఒత్తిడిలో ఉన్న స్టీవ్ స్మిత్.. బ్రిస్బేన్‌లో ఏకంగా శతకబాదాడు. సెంచరీ తర్వాత హెడ్ మరింత దూకుడు పెంచాడు. 18 ఫోర్లతో 157 బంతుల్లో 150 పరుగుల మార్క్ చేరుకున్నాడు. 75/3 వద్ద మొదలైన హెడ్, స్మిత్ భాగస్వామ్యం.. 316/4 వద్ద ముగిసింది. టీ విరామం అనంతరం ఆసీస్ పరుగుల వేటలో వెనక్కి తగ్గకపోయినా.. భారత బౌలర్లు ఓ నాలుగు వికెట్లు పడగొట్టారు. స్మిత్, మిచెల్ మార్ష్ (5), ట్రావిశ్ హెడ్ సహా పాట్ కమిన్స్ (20) పెవిలియన్‌కు చేరారు. కానీ చివరి సెషన్లో 31 ఓవర్లలో 171 పరుగులు పిండుకున్న ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 405/7 పరుగులు చేసింది. రెండో రోజు ఆటలోనే ఆసీస్ ఏకంగా 405 పరుగులు చేసింది. ఓవర్‌కు నాలుగు పరుగుల చొప్పున పిండుకున్న కంగారూలు గబ్బా టెస్టుపై అప్పుడే పట్టు బిగించారు!. భారత బౌలర్లలో జశ్‌ప్రీత్ బుమ్రా (5/72) ఐదు వికెట్లు పడగొట్టినా..ఇతర బౌలర్లు విఫలమయ్యారు. మహ్మద్ సిరాజ్ (1/97), నితీశ్ కుమార్ రెడ్డి (1/65), ఆకాశ్ దీప్ (0/78), రవీంద్ర జడేజా (0/76) తేలిపోయారు.

స్కోరు వివరాలు :

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : ఉస్మాన్ ఖవాజా (సి) పంత్ (బి) బుమ్రా 21, నాథన్ మెక్‌స్వీనీ (సి) కోహ్లి (బి) బుమ్రా 9, మార్నస్ లబుషేన్ (సి) కోహ్లి (బి) నితీశ్ 12, స్టీవ్ స్మిత్ (సి) రోహిత్ (బి) బుమ్రా 101, ట్రావిశ్ హెడ్ (సి) పంత్ (బి) బుమ్రా 152, మిచెల్ మార్ష్ (సి) కోహ్లి (బి) బుమ్రా 5, అలెక్స్ కేరీ నాటౌట్ 45, పాట్ కమిన్స్ (సి) పంత్ (బి) సిరాజ్ 20, మిచెల్ స్టార్క్ నాటౌట్ 7, ఎక్స్‌ట్రాలు :33, మొత్తం :(101 ఓవర్లలో 7 వికెట్లకు) 405.

వికెట్ల పతనం : 1-31, 2-38, 3-75, 4-316, 5-326, 6-327, 7-385.

బౌలింగ్ : జశ్‌ప్రీత్ బుమ్రా 25-7-72-5, మహ్మద్ సిరాజ్ 22.2-4-97-1, ఆకాశ్ దీప్ 24.2-5-78-0, నితీశ్ కుమార్ 13-1-65-1, రవీంద్ర జడేజా 16-2-76-0.

పివి సింధు వివాహ ఆహ్వానం



- సిఎం, డిప్యూటీ సిఎంలను కలిసి పెళ్లిపత్రికలు అందజేత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లను బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధు వేర్వేరుగా ఆదివారం కలిశారు. ఈ నెల 22న జరిగే ఆమె వివాహానికి ఆహ్వానించేందుకు ఇరువురిని కలిశారు. ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబును, మంగళగిరిలో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌ను తన తండ్రితో కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు.

సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ఛాంపియన్ ముంబయి

బెంగళూరు: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీ ఛాంపియన్‌గా ముంబయి నిలిచింది. ఆదివారం మధ్యప్రదేశ్‌తో జరిగిన ఫైనల్‌లో ముంబయి 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ముంబయి దేశవాళీ టీ20 ఛాంపియన్‌గా నిలవడం ఇది రెండోసారి. తొలుత రజత్ పాటిదార్ (81: 40 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సులు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడటంతో మధ్యప్రదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని ముంబయి 17.5 ఓవర్లలోనే 5 వికెట్లు నష్టపోయి ఛేదించింది. ఓపెనర్ అజింక్య రహానె (37: 30 బంతుల్లో 4 ఫోర్లు) మరోసారి రాణించగా.. సూర్యకుమార్ యాదవ్ (48: 35 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులు) మెరిశాడు. శ్రేయస్ అయ్యర్ (16), పృథ్వీ షా (10), శివమ్ దూబె (9) పరుగులు చేశారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68